

గుంటూరు రైల్వే భళా



- ఎన్ఎస్‌జీ-2 హోదాకు ఎగబాగిన స్టేషన్
- ప్రయాణికులు, ఆదాయం పెరగడమే కారణం
- గత ఏడాదిలో స్టేషన్ ఆదాయం రూ.110.70 కోట్లు
- రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలకు నిధులు
- ఎన్ఎస్‌జీ-4 హోదాలో సత్తెనపల్లి, మంగళగిరి రైల్వేస్టేషన్లు
- ఎన్ఎస్‌జీ-5లో రేపల్లె, నరసరావుపేట, పిడుగురాళ్ల, వినుకొండ, మాచర్ల

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాన్ సబర్బన్ గ్రూపు(ఎన్ఎస్‌జీ)-3 కేటిగిరీ నుంచి గుంటూరు రైల్వేస్టేషన్ ఎన్ఎస్‌జీ-2కి ఎగబాకింది. ఈ స్టేషన్ నుంచి ప్రయాణికుల సంఖ్య పెరగడం, టిక్కెట్ చార్జీల రూపంలో ఆదాయం కూడా పెరిగిన కారణంగా రైల్వేబోర్డు ఈ నిర్ణయాన్ని తీసుకుంది. దేశ వ్యాప్తంగా వివిధ రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల సంఖ్య ఆదాయం ఆధారంగా నాన్ సబర్బన్ గ్రూపు (ఎన్ఎస్‌జీ) స్టేషన్లను వర్గీకరించింది. అందులో గుంటూరు రైల్వేస్టేషన్‌ని ఎన్ఎస్‌జీ-2లోకి ప్రతిపాదిస్తున్నట్లు తాజాగా జాబితాని విడుదల చేసింది. దీని వల్ల రాబోయే రోజుల్లో ప్రయాణికులకు సౌకర్యాలను మెరుగుపరచడానికి రైల్వే శాఖ అధిక మొత్తంలో నిధులు విడుదల చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎన్ఎస్‌జీ స్టేషన్ల నుంచి ప్రయాణించిన ప్యాసింజర్ల సంఖ్య, ఆదాయం ఆధారంగా చేసుకుని రైల్వే బోర్డు వర్గీకరించింది. అలానే సబర్బన్, హాల్ట్ స్టేషన్లను కూడా కేటిగిరైజేషన్ చేసింది. గుంటూరు రైల్వేస్టేసన్ నుంచి రిజర్వుడ్ బోగీల్లో 16 లక్షల 63 వేల 252 మంది, అన్ రిజర్వుడ్ బోగీల్లో 42 లక్షల 64 వేల 7 8 7 మంది ప్రయాణించారు. దీంతో మొత్తంగా 59 లక్షల 28 వేల 39 మంది గత ఆర్థిక సంవత్సరంలో ఈ స్టేషన్ నుంచి ప్రయాణించారు. తద్వారా రిజర్వుడ్ టిక్కెట్ల ద్వారా రూ.71 కోట్ల 8 లక్షల 71 వేల 21, అన్ రిజర్వుడ్ టిక్కెట్ల ద్వారా రూ.39 కోట్ల 62 లక్షల 26 వేల 561 కలిపి మొత్తం 110 కోట్ల 70 లక్షల 97 వేల 582 ఆదాయం వచ్చింది. దీనిని ఆధారంగా చేసుకుని రైల్వే బోర్డు గుంటూరు రైల్వేస్టేషన్‌ని ఎన్ఎస్‌జీ-2 కేటిగిరీకి ప్రతిపాదించింది. కాగా డివిజన్ పరిధిలోని నంద్యాల, నల్గొండ, సత్తెనపల్లి, మార్కాపురం రోడ్డు, మంగళగిరి రైల్వేస్టేషన్లకు ఎన్ఎస్‌జీ-4 హోదా దక్కింది. రేపల్లె, మిర్యాలగూడ, గిద్దలూరు, పిడుగురాళ్ల, నరసరావుపేట, నడికుడి, న్యూగుంటూరు, కంభం, వినుకొండ, దొనకొండ, మాచర్ల రైల్వేస్టేషన్లు ఎన్ఎస్‌జీ-5లో కొనసాగుతున్నాయి. ఇక వేమూరు, చినరావూరు, కురిచేడు, తర్లుపాడు, సోమిదేవిపల్లె, పేరేచర్ల, రామన్నపేట, విష్ణుపురం, పెదకాకాని హాల్ట్, గాజుపల్లి, నంబూరు, ఫిరంగిపురం, బెల్లంకొండ, చిట్యాల, నాగిరెడ్డిపల్లి, వేజండ్ల, గజ్జలకొండ, పెదకూరపాడు, సంగం జాగర్లమూడి, సిరిపురం, దిగువమెట్ట, నల్లపాడు, శావల్యాపురం, జగ్గంబొట్ల కృష్ణాపురం, బండారుపల్లి, రెడ్డిగూడెం, నుదురుపాడు, తుమ్మలచెరువు, తిప్పర్తి, సంతమాగులూరు, పొట్లపాడు, గుండ్లకమ్మ, వలిగొండ, మునుమాక, శ్రీరాంపురం, సాతులూరు, చీకటీగల పాలెం, పొందుగుల, యడవల్లి, చెలమ స్టేషన్లు ఎన్ఎస్‌జీ-6లో ఉన్నాయి. భట్టిప్రోలు హెచ్‌జీ-1, గురజాల, రెంటచింతల హాల్ట్, పల్లికోన హెచ్‌జీ-2, పెనుమర్రు హాల్ట్, వెల్లలచెరువు, జంపని హాల్ట్, కృష్ణమశెట్టిపల్లి హెచ్‌జీ-3లో కొనసాగుతున్నాయి.

- సాగునీటి కాల్వల బాగుకే వ్యయం
- పూడికతీత, మరమ్మతులపై ప్రభుత్వం దృష్టి
- వసూళ్ల మొత్తం రైతుల కోసం వెచ్చించాలని నిర్ణయం
- రైతులపై శిస్తు భారానికే పరిమితమైన వైసీపీ పాలకులు
- బకాయిల వసూళ్లపైనే ఐదేళ్లు యావ.. ఊసేలేని మరమ్మతులు



కాల్వలో ఉన్న గుర్రపు డెక్క తొలగించడంతో నీటి ప్రవాహంతో కళకళలాడుతున్న రేపల్లె మండల పరిధిలోని అరవపల్లి కాలువ

తీరువా మారుతోంది

సాగునీరు పారాల్సిన కాల్వలు.. పూడికతో పూడిపోయాయి. సాగునీరు ఉన్నా పంటలకు సకాలంలో అందక ఎండిపోతున్నాయి. పంటలకు నీటి కోసం రైతులు పాట్లు పడి చివరకు నష్టపోతున్నారు. రైతుల నుంచి నీటి తీరువా పేరు తో శిస్తులు వసూలు చేస్తున్నా కాల్వల బాగు గురించి గత ఐదేళ్లు వైసీపీ పాలకులకు పట్టలేదు. కాల్వలు అధ్వానంగా మారినా.. రైతులు నష్టపో తున్నా ప్రభుత్వం కనీసం కూడా దృష్టి సారించలేదు. అలాగని రైతుల నుంచి నీటి తీరువా వసూలు చేయ లేదా అంటే వడ్డీల భారం కూడా మోపారు. ఇలా వసూ లు చేసిన మొత్తాలతో కాల్వల బాగుకు వెచ్చించలేదు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని రైతులు రెండు రకాలుగా నష్టపోవాల్సి వచ్చింది. ఈ పరిస్థి తుల్లో కూటమి ప్రభుత్వం కాల్వల బాగుపై దృష్టి సారించడమే కాకుండా నీటి తీరువా మొత్తాలని ఆ పరిధిలోని కాల్వల మరమ్మతులకే వ్యయం చేయాలని నిర్ణయించింది. కూటమి ప్రభుత్వ తాజా నిర్ణయంతో కాల్వలు బాగు పడటమే కాకుండా పంటలకు సాగు నీరు అందుతుందని తద్వారా తమకు లబ్ధి చేకూరుతుందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాపట్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శిస్తులు వసూలు చేయడం.. చెల్లించకపోతే రైతులపై వడ్డీల భారం మోపడం.. ఆ మొత్తాలను పక్కదారి పట్టించడం.. అన్నట్లుగా వైసీపీ ఐదేళ్ల పాలన సాగగా.. కూటమి ప్రభుత్వం ఆ విధానాన్ని మార్చేస్తోంది. రైతుల నుంచి వసూలు చేసిన శిస్తులను రైతుల కోసమే ఖర్చు చేయాలని నిర్ణయించింది. అన్నదాతల కనీస అవసరాలపైన వైసీపీ ప్రభుత్వం దృష్టిపెట్టలేదు. నీటి తీరువా వసూలు విషయంలో నాటి పాలకులు నానా ఇబ్బందులకు గురిచేశారు. చివరి ఆయకట్టుకు సాగునీరు అందకపోయినా, చివరికి మెట్ట భూమి రైతులు కూడా నీటి తీరువా చెల్లించాల్సిందే నని వైసీపీ ప్రభుత్వం అన్నదాతలను ఇబ్బంది పెట్టింది. కాల్వల్లో పూడిక తీతలు తీయకుండా ఐదేళ్ల పాటు కాలయాపన చేసిందే తప్ప రైతుల సాగునీటి వెతలను పట్టించుకోలేదు. అయినా నీటి తీరువా వసూలు చేయడంలో మాత్రం విపరీతమైన ఒత్తిడి తెచ్చి ఖజానా నింపుకుంది.

కాల్వల బాగుకు నిధులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాల్వల బాగుపైన దృష్టిపెట్టి నిధులు విడుదలకు పచ్చజెండా ఊపింది. అంతటితో సరిపెట్టకుండా పనులను కూడా మొదలు పెట్టింది. అయితే ఈలోగా వరదలు రావడంతో పనులకు బ్రేక్ పడింది. పంట పొలాలు రోజుల తరబడి ముంపులో ఉండడానికి వైసీపీ ఐదేళ్ల నిద్రమత్తు కూడా ప్రధాన కారణంగా నిలిచింది. వరదలు తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొనడంతో కాల్వల మరమ్మతుల పనులు మళ్లీ ఊపందుకున్నాయి. ఇదే సమయంలో రైతుల నుంచి రావాల్సిన నీటితీరువా బకాయిల విషయంలో దృష్టి పెట్టింది. అన్నదాతల దగ్గర నుంచి వసూలు చేసిన పన్నును తిరిగి వారి సంక్షేమానికే ఖర్చు పెట్టేలా కూటమి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి అడుగులు వేస్తోంది.

వినతిపత్రాలు ఇచ్చినా పట్టని పాలకులు

బాపట్ల జిల్లాగా ఆవిర్భవించిన తొలి రెండేళ్లలో నీటి తీరువా కింద రైతుల నుంచి దాదాపు రూ.11 కోట్లను గత ప్రభుత్వం వసూలు చేసింది. నీటితీరువా మొత్తాన్ని సాగునీటి కాల్వల బాగుతో పాటు ఇరిగేషన్ పనుల కోసమే ఖర్చు చేయడం ఎప్పటి నుంచో వస్తున్న రివాజు. కానీ వాటికి వైసీపీ పాలకులు పాతరేసి యథేచ్ఛగా ఆ నిధులను పక్కదారి పట్టించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చివరి ఆయకట్టుకు నీరందక రైతులు లబోదిబోమన్నారు. కాల్వల పూడికతీతపై డీఆర్సీ సమావేశంతో పాటు జడ్పీ సమావేశాల్లోనూ రైతులు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. పైగా రైతులపై విపరీతమైన ఒత్తిడి తెచ్చి మరీ నీటి తీరువా కట్టించుకోవడంలో మాత్రం గత ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపింది.

రైతులే స్వచ్ఛందంగా..

వైసీపీ ప్రభుత్వంలో కాల్వల బాగుపై వినతులు ఇచ్చి వేసారిన చివరకు రైతులు స్వచ్ఛందంగా బాగుచేసుకున్న ఉదంతాలు ఉన్నాయి. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండి భారీ వర్షాలు కురిసిన సమయంలో అవి పొంగి మురుగునీరు పొలాల్లోకి వచ్చి రోజుల తరబడి నిల్వ ఉండడంతో పైరు పాడైపోయేది. మొక్కుబడి తంతుగా పాలనా పరమైన అనుమతులు ఇచ్చిన పనులకు బిల్లులు చెల్లించకుండా వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులు పెట్టడంతో అసంపూర్తిగా పనులు మిగిలిపోయాయి. వసూలు చేసిన నీటి తీరువా మొత్తాలతో ఆ బిల్లులు చెల్లించాల్సి ఉన్నా ఆ నిధులను పక్కదారి పట్టించడంతో రైతుల ఆవేదన ఆలకించే వారే లేకపోయారు.

104 పనులకు రూ.9 కోట్లు

కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే సాగునీటి కాల్వల బాగును అత్యంత ప్రా ధాన్య అంశంగా తీసుకుంది. నీటితీరువా వసూళ్ల మొత్తంతో పాటు ప్రభుత్వం అదనంగా నిధులు విడుదల చేసింది. సాగునీటి కాల్వలను సంస్కరించ డంతో పాటు చివరి ఆయకట్టు వరకు నీటిని అందించా లనే కృతనిశ్చయంతో కూటమి ప్రభుత్వం ఉండడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరగానే కాల్వల్లో పూడికతీత పనులతో పాటు గుర్రపుడెక్క, తూటుకాడ తొలగించ డంపై దృష్టి పెట్టింది. నీటి తీరువా నిధులు సక్రమంగా వినియోగించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించడంతో బాగు చేసిన పంట కాల్వలు నీటి ప్రవాహంతో కళకళలాడుతున్నాయి. కేటాయించిన పనుల్లో ఇప్పటికే 50 శాతం ఒక కొలిక్కి రాగా త్వరలోనే అన్ని పూర్తయి కాల్వలు కొత్తరూపును సంతరించుకోనున్నాయి.



గుంటూరు ఛానల్

పనులు.. నిధులు

- గుంటూరు చానల్ పరిధిలో 5 పనులకు రూ.1.30 కోట్లు
- బాపట్ల జిల్లాలో 104 పనులకు రూ.9 కోట్లు
- తెనాలి డివిజన్‌లో 85 పనులకు రూ.5 కోట్లు
- పల్నాడు జిల్లాలో పనులకు రూ.2 కోట్లు

అక్రమాలపై.. మౌనం

- క్వార్ట్జ్, మట్టి తవ్వకాలపై చర్యలు శూన్యం
- త్రిపురాపురం కొండ పరిశీలనకే మైనింగ్ శాఖ పరిమితం
- తవ్వకాల్లో అధికార పార్టీ నేతల పాత్ర..
- వదిలేశారన్న విమర్శలు
- క్వార్ట్జ్ తరలింపుతో ప్రభుత్వ ఆదాయానికి గండి..
- పట్టించుకోని అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

త్రిపురాపురం కొండ కేంద్రంగా క్వార్ట్జ్.. మట్టి తవ్వకాలపై ఆంధ్రజ్యోతిలో ఇటీవల వెలువడిన కథనంపై మైనింగ్ శాఖ స్పందించింది. అధికారులు నరసింగపాడు, త్రిపురాపురం కొండలను పరిశీలించారు. అనుమతి పొందిన చోట కాకుండా వేరే ప్రాంతంలో తవ్వకాలు జరిగినట్లు మైనింగ్ శాఖ నిర్ధారించింది. దీంతో అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారని అందరూ భావించారు. కానీ ఇంతవరకు అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు తీసుకోకపోవడంపై అనుమానాలు వస్తున్నాయి. అక్రమంగా తవ్వకాలు జరిపి ఎగుమతికి సిద్ధం చేసిన క్వార్ట్జ్ నిల్వలను సీజ్ చేసి స్వాధీనం చేసుకోలేదు. కొండపై క్వార్ట్జ్ ప్రాసెసింగ్ కోసం ఏర్పాటు చేసిన యూనిట్‌ను సీజ్ చేయకపోవడం గమనార్హం. అధికార పార్టీ నేతలు అక్రమ తవ్వకాలు జరుపుతుండటంతో అధికారులు చర్య లు తీసుకోకుండా మిన్నకున్నారన్న విమర్శలున్నాయి. పెద్దఎత్తున చేపట్టిన తవ్వకాలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు మిన్నకున్నారన్న విమర్శలున్నాయి. త్రిపురాపురం కొండను అక్రమార్కులు మింగేసినా పరిశీలనకే అధికారులు పరిమితమయ్యారు. ఏ మేరకు క్వార్ట్జ్, మట్టి తవ్వకాలు జరిపారు.. ఇందుకు బాధ్యులు ఎవరు.. వారి గుర్తింపు తదితరాల ఊసే మరిచారు. అధికార పార్టీ నేతల ఒత్తిడి వల్లే అక్రమార్కులపై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. కొండపై నుంచి క్వార్ట్జ్ ఎగుమతులు జరిగినట్లు కూడా తనిఖీలు చేపట్టిన అధికారులు నిర్ధారించారు. అయితే క్వార్ట్జ్ రాయల్టీ చెల్లింపులకు సంబంధించిన లెక్కలు అధికారుల వద్ద లేక పోవడం గమనార్హం.




ఎగుమతికి ప్రాసెస్ చేసిన క్వార్ట్జ్

గతంలో వైసీపీ.. నేడు టీడీపీ నేతలు

గతంలో వైసీపీ నేతలు క్వార్ట్జ్, మట్టి తవ్వకాలు జరిపారు. ఇదే బాటలో ప్రస్తుతం టీడీపీ నేతలు కొందరు పయనిస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలు మట్టి, క్వార్ట్జ్‌లను ఆదాయ వనరులుగా వినియోగించుకుంటున్నారు. గత ఐదేళ్లు పెద్దఎత్తున అక్రమ మైనింగ్‌కు వైసీపీ నేతలు పాల్పడ్డారు. ఇప్పుడు టీడీపీ నేతలు అదే బాటలో పయనిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మైనింగ్ అంశంలో ప్రభుత్వం పెద్దమొత్తంలో ఆదాయం కోల్పోతోంది. మైనింగ్ శాఖ పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీంతో అక్రమార్కులు బరితెగిస్తున్నారు.



ఎగుమతికి సిద్ధం చేసిన క్వార్ట్జ్ నింపిన బ్యాగ్‌లు



త్రిపురాపురం కొండపై అక్రమ తవ్వకాలు జరిగిన ప్రాంతం

జడ్పీ ఆస్తుల రక్షణకు పోరాటం

- స్థాయి సంఘ సమావేశంలో చైర్‌పర్సన్
- తుమ్మలచెరువు టోల్ ప్లాజా స్థలంపై చర్చ
- నామ్ ఎక్స్‌ప్రెస్ వే జీవోపై జడ్పీటీసీల అభ్యంతరం

గుంటూరు సిటీ, సెప్టెంబరు 13: జిల్లా పరిషత్ ఆస్తుల పరిరక్షణకు రాజీలేని పోరాటం చేస్తామని జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా తెలిపారు. జడ్పీ చైర్మన్ చాంబర్‌లో హెనీక్రిస్టీనా అధ్యక్షతన శుక్రవారం మొదటి స్థాయి సంఘం సమావేశం జరిగింది. పిడుగురాళ్ల, నాదెండ్ల మండలం గణపవరంలోని జడ్పీ స్థలాల ఆక్రమణలపై స్థానిక జడ్పీటీసీలు జంగా కోటయ్య, కాట్రగడ్డ మస్తాన్‌రావు సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. కోటప్పకొండలోని జడ్పీ స్థలాన్ని గ్రానైట్ వ్యాపారులు ఆక్రమించుకున్నారని నరసరావుపేట జడ్పీటీసీ చిట్టిబాబు తెలిపారు. అచ్చంపేట సమీపంలోని పొలం వ్యవహారం ఏమైందని జడ్పీటీసీ విజయప్రతాప్‌రెడ్డి అధికారులను ప్రశ్నించారు. ఈ క్రమంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లా పరిషత్‌కు చెందిన ఆస్తులను పరిరక్షించేందుకు ప్రొటెక్షన్ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. అందులో ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో పరిధిలోని ఆర్డీవోలు సభ్యులుగా ఉన్నారని చెప్పారు. ఒక్క సెంటు భూమి కూడా అన్యాక్రాంతం కాకూడదన్న సంకల్పంతో ప్రొటెక్షన్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. సభ్యులు చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని, అధికారులు ఆయా మండలాలకు వెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు చెట్టు సమీపంలో ఏర్పాటు చేసిన టోల్ ప్లాజాపై సమావేశంలో చర్చ జరిగింది. టోల్ ప్లాజా సమీపంలోని 2.71 సెంట్ల జడ్పీ స్థలాన్ని ఏడాదికి రూ.1.59 లక్షలకు నామ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్వాహకులు లీజుకు తీసుకోగా రూ.12 లక్షలు బకాయిలు చెల్లించాల్సి ఉందని సభ్యులు చెప్పారు. 2022లో పాలక వర్గం లేని సమయంలో రూ.9.50 లక్షలకు సదరు స్థలాన్ని ఆర్అండ్‌బీ ద్వారా నామ్‌కి ఇచ్చేందుకు అప్పటి కలెక్టర్ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారని తెలిపారు. 215 జీవో వల్ల జడ్పీకి నష్టం వాటిల్లుతుందని అధికారులు సభ్యులకు వివరించగా దీనిని అడ్డుకోవాలని సభ్యులు నిర్ణయించారు. అప్పటి కలెక్టర్ జడ్పీ ఆస్తిని అన్యాక్రాంతం చేసేందుకు ఏకపక్షంగా వ్యవహరించారని కొందరు సభ్యులు అభిప్రాయపడ్డారు.



స్థాయి సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ క్రిస్టినా

పల్నాడు జలజీవన్ పనులపై..

పల్నాడులో జరుగుతున్న జలజీవన్ పనుల్లో ప్రతిష్ఠంభనపై జడ్పీటీసీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో టెండర్ ప్రక్రియ పూర్తయినా పనులు యథావిధిగా కొనసాగించవచ్చని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. 2021లో చేసిన పనులకు కూడా బిల్లులు చెల్లించలేదని పిడుగురాళ్ల జడ్పీటీసీ చెప్పారు. పల్నాడు మైనింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారుల గైర్హాజరుపై కొందరు సభ్యులు ప్రశ్నించారు.

డ్రెయిన్లను విస్తరించకుంటే ఇబ్బందే

- ఏటా ముంపునకు గురవుతున్న పొలాలు.. నష్టపోతున్న రైతులు

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడో దశాబ్ధాల క్రితం అప్పటి వర్షపాతాన్ని దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసిన డ్రెయిన్ల సామర్థ్యం ప్రస్తుతం సరిపోవడం లేదు. రెండు వారాల క్రితం కురిసిన భారీ వర్షానికి వాటి సామర్థ్యానికి మించి ప్రవహించాయి. జిల్లా వ్యాప్తంగా పంటలు నీట మునగడానికి ఈ డ్రెయిన్లే ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో డ్రెయిన్ల రీ డిజైన్ చేయాల్సిన అవసరం ఏర్పడింది. కృష్ణా పశ్చిమ డెల్టాలో ఉన్న 12 డ్రెయిన్లను సాధ్యమైనంత త్వరగా రీడిజైన్ చేసి డిశ్చార్జి కెపాసిటీని పెంచకపోతే రాబోయే రోజుల్లో పంటలకు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు రీడిజైన్ ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపాల్సిన అవసరం ఏర్పడింది. మురుగునీరు, వరదనీటిని సముద్రంలోకి ప్రవహింప చేసేందుకు కొల్లిమెర్ల, వేంకల, చేబ్రోలు సైడ్, జల్ల, నక్క, కొండ అప్పర్ ఆర్మ్, లోయర్‌ఆర్మ్, గుం టూరు నల్లా, రేపల్లె, తుంగభద్ర, కొండవీటి, పాలవాగులున్నాయి. వీటిల్లో కొల్లిమెర్ల డ్రెయిన్ డిశ్చార్జి కెపాసిటీ 6330 క్యూసెక్కులు కాగా ఇటీవల కురిసిన భారీ వర్షం సమ యంలో 7,596 క్యూసెక్కుల వరదనీరు రావడంతో ఓవర్ ఫ్లో అయింది. మేకలవాగు డ్రెయిన్ 1100 క్యూసెక్కులకు పూర్తిస్థాయిలో ప్రవహించింది. చేబ్రోలు సైడ్ డ్రెయిన్ 1479 క్యూసెక్కుల సామర్థ్యం కాగా 1775 క్యూ సెక్కులు, జల్ల వాగు నెంబరు. 1 డ్రెయిన్ 2380 క్యూసెక్కులకు 3094, నక్కవాగు అప్పర్ ఆర్మ్ 3810 క్యూసెక్కులకు 4954, కొండవాగు అప్పర్ ఆర్మ్ ఏఎం చానల్ పైన 2430 క్యూసెక్కులకు 3038 క్యూసెక్కులు, కొండ వాగు అప్పర్ ఆర్మ్ ఏఎం చానల్ దిగువన 2664 క్యూసెక్కులకు 3410 క్యూసెక్కులు ప్రవహించి ఓవర్ ఫ్లో అయ్యాయి. ఇదేరీతిన కొండవాగు లోయర్ ఆర్మ్ ఏఎం చానల్ దిగువన 1116 క్యూసెక్కులకు 1418 క్యూసెక్కులు, గుంటూరు నల్లా మేజర్ డ్రెయిన్ 5364.35 క్యూసెక్కులకు 9,357 క్యూసెక్కులు, రేపల్లె మెయిన్ డ్రెయిన్ 2313 క్యూసెక్కులకు 3245, తుంగబద్ర డ్రెయిన్ 11701 క్యూసెక్కుల సామర్థ్యం కాగా 15643 క్యూసెక్కుల వరద ప్రవహించింది. డ్రెయిన్ల ఓవర్ ఫ్లో కారణంగా గట్లు తెగిపోయి పొలాలు వారం పైగా నీట మునిగాయి. ముఖ్యంగా వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. దాదాపుగా 40 వేల హెక్టార్లలో ఈ రెండు రకాల పంటలు ఖరీఫ్‌లో 100 శాతం నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో డ్రెయిన్ల రీడిజైన్ ఆవశ్యకత ఏర్పడింది. ఈ డ్రెయిన్లన్నీ ఎప్పుడో బ్రిటీష్ కాలంలో కృష్ణా డెల్టా ఏర్పాటు జరిగినప్పుడు డిజైన్ చేసినవి. ఒకే రోజున 27 సెంటీమీటర్ల రికార్డుస్థాయి వర్షపాతం నమోదు కావడా న్ని పరిగణనలోకి తీసుకుని రాబోయే రోజుల్లో ఇంకా వర్షపాతం పెరిగే అవకాశాన్ని కూడా అంచనా వేసి ఈ డ్రెయిన్ల సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఏర్పడింది.

డా.ఎన్టీఆర్ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో నర్సింగ్ కోర్సులు



విజయవాడలోని డా.ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(డా.ఎన్టీఆర్ యూహెచ్ఎస్)- బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనుబంధ కళాశాలల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లు భర్తీ చేయనున్నారు. ఈ కోటా కింద ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల్లో మొత్తం సీట్లు; ప్రైవేట్ అన్ ఎయిడెడ్ మైనారిటీ, నాన్ మైనారిటీ నర్సింగ్ కాలేజీల్లో 60 శాతం సీట్లు అలాట్ చేస్తారు. ప్రతి ప్రోగ్రామ్‌లో 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. మిగిలిన 15 శాతం సీట్లకు స్థానికులు సహా స్థానికేతర అభ్యర్థులందరూ పోటీ పడవచ్చు. వెబ్ కౌన్సెలింగ్ నాటికి సీట్ల వివరాలు ప్రకటిస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

బీఎస్సీ నర్సింగ్: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. దీనిలో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు; ఇంటర్ ఒకేషనల్‌తోపాటు బయలాజికల్ అండ్ ఫిజికల్ సైన్సెస్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏఐఎస్ఎస్‌సీఈ/ఐసీఎస్ఈ/ఎస్ఎస్‌సీఈ /హెచ్ఎస్‌సీఈ/ఎన్ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్ అభ్యర్థు లు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సైన్స్ సబ్జెక్టుల్లో జనరల్ అభ్యర్థులకు 45 శాతం; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. ఏపీఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. జనరల్ కేటగిరీలో(దివ్యాంగులు సహా) 40382లోపు; ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీల్లో 48459లోపు ర్యాంక్ సాధించిన వారికి ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది.

పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గుర్తింపు పొందిన బోర్డు/ఎన్ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్ నుంచి ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణతతోపాటు జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కోర్సు పూర్తిచేసి స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ గుర్తింపు పొందినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏడాదిన్నర వ్యవధి గల ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024డిసెంబరు 31 నాటికి 21 ఏళ్లు నిండి ఉండాలి. అకడమిక్ మెరిట్, జీఎన్ఎం మార్కుల ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2360; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1888
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- **వెబ్‌సైట్:** https://drntr.uhsap.in

దిక్సూచి DIKSUCHI

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)కి చెందిన మధురై రీజనల్ సెంటర్- డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్(డీఐఎస్ఎల్ ఐ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. ఇంగ్లీష్, హిందీ, తమిళం మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌నకు న్యూఢిల్లీలోని రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) గుర్తింపు ఉంది. అభ్యర్థులకు నెలకు రూ.2,000ల స్టయిపెండ్ ఇస్తారు. దివ్యాంగులకు, దివ్యాంగుల తల్లిదండ్రులకు ఇన్‌స్టిట్యూషనల్ ఫీజు ఉండదు. దివ్యాంగుల తోబుట్టువులకు 75 శాతం ఫీజు రాయితీ లభిస్తుంది. హాస్టల్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.200; ఈడబ్ల్యుఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100; దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in

రామానుజం నేషనల్ మేథ్స్ ఛాలెంజ్



ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ స్కిల్ డెవలప్‌మెంట్(ఏఐసీటీఎస్‌డీ)- 'రామానుజం నేషనల్ మేథ్స్ ఛాలెంజ్(ఆర్ఎన్ఎంసీ) 2025'కు దరఖాస్తులు కోరుతోంది. మేథ్స్‌లో నేటి తరం విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకుగాను 'నేషనల్ మేథ్స్ స్కాలర్-2025' కాన్సెప్ట్‌తో ఈ పోటీని నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొనే విద్యార్థులు మేథమెటిక్స్‌కు సంబంధించి ఆన్‌లైన్ ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా నాలుగోతరగతి నుంచి పన్నెండోతరగతి చదివే విద్యార్థులందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మేథమెటిక్స్‌లో ఆసక్తి ఉన్నవారు జాతీయ స్థాయిలో తమ స్కిల్స్ ప్రదర్శించేందుకు ఇది సదవకాశం.

ఆన్‌లైన్ ఎగ్జామ్ వివరాలు: అభ్యర్థులు ఇంటి వద్దనే ఆన్‌లైన్ ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది. పరీక్ష సమయం 45 నిమిషాలు. ఇందులో 30 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున మొత్తం మార్కులు 60. రుణాత్మక మార్కులు ఉన్నాయి. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ఎగ్జామ్ తేదీ, టైం స్లాట్, ఆన్‌లైన్ ఎగ్జామ్ లింక్ తదితరాలను విద్యార్థుల మొబైల్‌కు ఎస్ఎంఎస్ ద్వారా పంపుతారు.

- నాలుగు నుంచి పన్నెండు వరకు ప్రతి తరగతికీ నిర్దేశించిన ఎగ్జామ్ సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

రివార్డులు: పరీక్షలో ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. వీరిలో ముగ్గురిని విజేతలుగా ప్రకటిస్తారు. మొదటి బహుమతి కింద రూ.75,000; ద్వితీయ బహుమతి కింద రూ.50,000; తృతీయ బహుమతి కింద రూ.25,000; రన్నరప్‌లుగా నిలిచిన 50 మందికి ఒక్కొక్కరికి రూ.2000; అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 100 మందికి ఒక్కొక్కరికి రూ.500ల నగదు ఇస్తారు. విజేతలందరికీ జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న ఏఐసీటీ ఎస్‌డీ సర్టిఫికెట్, నేషనల్ మేథ్ స్కాలర్ ట్రోఫీ అందిస్తారు. సంస్థ అంతర్జాతీయంగా నిర్వహించే వివిధ ప్రాజెక్టులు, టెక్నికల్ ఈవెంట్లు సహా పలు సెమినార్లలో నేరుగా పాల్గొనే అవకాశం కల్పిస్తారు. నేషనల్ మేథమెటిక్స్ సైంటిస్ట్ స్కాలర్‌షిప్ కూడా లభిస్తుంది. రోబోటిక్స్ ఆటోమేషన్ అండ్ కోడింగ్‌లో ట్రెయినింగ్ ఇస్తారు. ప్రథమ బహుమతి విజేతకు ఏడాది, ద్వితీయ బహుమతి పొందినవారికి ఆరు నెలలు, తృతీయ బహుమతి సాధించినవారికి మూడు నెలలు శిక్షణ ఇస్తారు. పోటీలో పాల్గొన్నవారందరికీ సంస్థ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఇస్తుంది.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.270
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 30
- **ఆన్‌లైన్ ఎగ్జామ్ తేదీ:** డిసెంబరు 10
- **ఫలితాలు విడుదల:** డిసెంబరు 20
- **ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు:** డిసెంబరు 30
- **విజేతల లిస్ట్ విడుదల:** 2025 జనవరి 15
- **వెబ్‌సైట్:** aictsd.com

నవ్య | చిత్రజ్యోతి

సందడంతా సెట్స్‌పైనే

ఈ నెలలో ఎన్టీఆర్ 'దేవర' మినహా పెద్ద హీరోల చిత్రాలేవి విడుదల లేకపోవడంతో థియేటర్లలో సందడి తగ్గనుంది. అయితే ఆ సందడి కాస్తా ఇప్పుడు సెట్స్‌లో మొదలైంది. హీరోలంతా కొత్త సినిమాల షూటింగ్స్‌తో బిజీగా ఉన్నారు. యువ కథానాయికలు సెట్స్‌లో చెమటోడ్చుతున్నారు. సీనియర్ హీరోలు షూటింగ్స్‌కు సై అంటున్నారు. వీరిలో కొందరు హీరోయిన్లతో డ్యూయెట్లు పాడుతుండగా మరికొందరు విలన్లతో పోరాడుతున్నారు. మొత్తం మీద వరుస చిత్రీకరణలతో తెలుగు కథానాయకులు జోరు మీదున్నారు.









యాక్షన్ మోడ్‌లో వెంకీ

అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం షూటింగ్ శరవేగంగా సాగుతోంది. పది రోజుల క్రితమే పొల్లాచ్చిలో హీరోయిన్ మీనాక్షి చౌదరితో డ్యూయెట్ పాడుకున్నారు వెంకటేశ్. అక్కడి నుంచి హైదరాబాద్ చేరుకున్నారో లేదో వెంటనే యాక్షన్ సీక్వెన్స్ కోసం రంగంలోకి దిగారు. ఈ చిత్రం తాజా షెడ్యూల్ రెండు రోజుల క్రితమే హైదరాబాద్‌లో మొదలైంది. ఇందులో ఆయన పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఈ 15 రోజుల షెడ్యూల్‌లో యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు ఇతర తారాగణంపై కీలక ఘట్టాలను తెరకెక్కించనున్నారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

కూలీ సెట్స్‌లో నాగ్

మల్టీస్టారర్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు నాగార్జున. రజనీకాంత్ కథానాయకుడిగా రూపొందుతున్న 'కూలీ' షూటింగ్ ప్రస్తుతం వైజాగ్‌లో జరుగుతోంది. నాగార్జున్ సెట్స్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఆయనపై యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు కొంత టాకీపార్ట్‌ను ఈ షెడ్యూల్‌లో తెరకెక్కించనున్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రుతీహాసన్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

క్లైమాక్స్‌కు మట్కా

కరుణకుమార్ దర్శకత్వంలో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందుతున్న 'మట్కా' చిత్రం షూటింగ్ క్లైమాక్స్‌కు చేరుకుంది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్టూడియోలో పతాక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. ఈ పీరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో మాఫియా నాయకుడి పాత్రలో వరుణ్ తేజ్ సరికొత్త మేకోవర్‌తో అలరించనున్నారు. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు.

రాజాసాబ్ పోరాటం

మారుతి దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న 'రాజా సాబ్' చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ సాగుతోంది. ప్రభాస్‌తో పాటు ప్రధాన తారాగణం అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటోంది. కొంత టాకీ పార్ట్‌ను పూర్తి చేసిన మారుతి తాజాగా పోరాట ఘట్టాలపై దృష్టి పెట్టారు. రామ్-లక్ష్మణ్ నేతృత్వంలో సాగే ఈ భారీ యాక్షన్ సీక్వెన్స్‌లో ప్రభాస్ పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్ ముగిశాక హనూ రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం షూటింగ్‌లో పాల్గొనేందుకు ప్రభాస్ చెన్నై వెళ్లనున్నారు.

కేరళకు దేవరకొండ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. చిత్రీకరణ చివరి దశలో ఉంది. ఈ వారంలో కేరళలో ఓ భారీ షెడ్యూల్‌ను మొదలుపెట్టేందుకు యూనిట్ సన్నాహాలు చేసింది. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో విజయ్ పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. అలాగే 'పుష్ప 2' క్లైమాక్స్ షూట్‌ను ముగించే పనిలో అల్లు అర్జున్ బిజీగా ఉన్నారు.

చందు మొండేటి, నాగచైతన్య కలయికలో రూపొందుతున్న చిత్రం 'తండేల్'. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోందని యూనిట్ తెలిపింది. టాకీపార్ట్‌తో పాటు పాటలను చిత్రీకరిస్తున్నారు. చైతూకు జోడీగా సాయిపల్లవి కనిపించనున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాస్ నిర్మిస్తున్నారు. నిఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'స్వయంభూ' షూటింగ్ కొనసాగుతోంది. శర్వానంద్ హీరోగా రామ్ అబ్బరాజు తెరకెక్కిస్తున్న చిత్రం ప్రస్తుతం సెట్స్‌పై ఉంది. లుధీర్ బైరెడ్డి రూపొందిస్తున్న చిత్రం షూటింగ్‌లో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పాల్గొంటున్నారు. శుక్రవారం నాని 'హిట్ 3' చిత్రీకరణ మొదలుపెట్టారు. సాయిదుర్గ తేజ్ హీరోగా రోహిత్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఇటీవలే రామ్‌లక్ష్మణ్ నేతృత్వంలో అటవీ నేపథ్యంలో సాగే యాక్షన్ పార్ట్‌ను యూనిట్ పూర్తి చేసింది.

విరామం తర్వాత

పవన్ కల్యాణ్ పాలిటిక్స్‌తో బిజీగా మారడంతో షూటింగ్స్‌కు తాత్కాలిక విరామం ఇచ్చారు. 'హరి హర వీరమల్లు, ఉస్తాద్ భగత్‌సింగ్, ఓజీ' చిత్రాలను ఆయన పూర్తి చేయాల్సి ఉంది. అలాగే మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం సెట్స్‌పైకి వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వస్తున్న చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కావాల్సి ఉంది. 'గేమ్ ఛేంజర్' చిత్రం షూటింగ్‌ను ఇటీవలే పూర్తి చేసిన రామ్‌చరణ్ త్వరలోనే కొత్త సినిమా షూటింగ్‌లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. పీరియాడిక్ చిత్రం కావడంతో ప్రస్తుతం ఆయన సరికొత్త మేకోవర్‌తో సిద్ధమవుతున్నారు. 'దేవర' ప్రచార కార్యక్రమాలను పూర్తి చేసిన ఎన్టీఆర్ ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో తెరకెక్కే చిత్రం కోసం రంగంలోకి దిగనున్నారు. అక్టోబర్ నుంచి షూటింగ్ మొదలుపెట్టనున్నట్లు యూనిట్ తెలిపింది. ఎన్టీఆర్ డిసెంబర్‌లో సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు.

హేమ డ్రగ్స్ తీసుకున్నారు

- మెడికల్ రిపోర్టులో రుజువైంది
- రేవ్‌పార్టీ కేసులో కోర్టుకు వెల్లడించిన పోలీసులు



బెంగళూరు నగరంలోని జీఆర్ ఫామ్‌హౌస్‌లో జరిగిన రేవ్ పార్టీలో తెలుగు నటి హేమ.. అలియాస్ కృష్ణవేణి డ్రగ్స్ తీసుకున్నట్టు పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. విజయవాడకు చెందిన ఎల్ వాసు ఈ ఏడాది మే 19న జీఆర్ ఫామ్‌హౌస్‌లో రేవ్ పార్టీ నిర్వహించారు. ఈ పార్టీలో పాల్గొన్న హేమ.. ఎండీఎంఏ సేవించారని, ఆమె మెడికల్ రిపోర్టులు, సంఘటనా స్థలంలో సేకరించిన ఆధారాలు దాన్ని రుజువు చేస్తున్నాయని పోలీసులు చార్జిషీట్‌లో వెల్లడించారు. ఈ రేవ్ పార్టీకి డ్రగ్స్ సమకూర్చిన వారిలో డెంటిస్ట్ రణధీర్ బాబు కీలకంగా వ్యవహరించారని, అబూబకర్ సిద్ధిఖీ పార్టీకి వచ్చిన వారికి కొకైన్, ఎండీఎంఏ సరఫరా చేశారని పోలీసులు తెలిపారు. ఈ కేసులో సీసీబీ పోలీసులు బెంగళూరు గ్రామీణ పరిధిలోని 8వ జిల్లా అదనపు సెషన్స్ కోర్టులో సోమవారం 1,086 పేజీలతో చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణతోపాటు 82 మంది సాక్షులను విచారించినట్లు అందులో పొందుపరిచారు. అర్ధరాత్రి జరిగిన పార్టీలో ఆంధ్ర, కర్ణాటకకు చెందిన ఫ్యాషన్ డిజైనర్లు, కళాశాల విద్యార్థులు, ప్రైవేట్ కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నట్లు వార్తలు వెలువడ్డాయి. 27 మంది మహిళల సహా 79 మంది డ్రగ్స్ సేవించినట్లు ఫోరెన్సిక్ నివేదికలో తేలింది. ఆ వివరాలను పోలీసులు చార్జ్‌షీట్‌లో పొందుపరిచారు. డ్రగ్స్ తీసుకున్న 79 మందితోపాటు రేవ్‌పార్టీ నిర్వాహకులు 9 మంది కలిపి మొత్తం 88 మందిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కాగా, హేమ మాత్రం తాను డ్రగ్స్ తీసుకోలేదని, పోలీసులు తన బ్లడ్ శాంపిల్స్ కూడా సేకరించలేదని మొదటి నుంచీ చెబుతున్నారు. మీడియా కూడా తనను అనవసరంగా ఈ వివాదంలోకి లాగుతోందని ఆరోపించారు. తాను డ్రగ్స్ తీసుకున్నట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనంటూ పలు ఇంటర్వ్యూల్లో ఆమె చెప్పారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

వేట మొదలైంది



హీరో నాని 32వ సినిమా 'హిట్.. ద థర్డ్ కేస్' రెగ్యులర్ షూటింగ్ శుక్రవారం మొదలైంది. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హిట్ ఆఫీసర్ అర్జున్ సర్కార్‌గా నాని నటిస్తున్నారు. ఈ ఫెరోషియస్ కేరెక్టర్ కోసం నాని పూర్తిగా మేకోవర్ అయ్యారు. తొలి రోజు షూటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. వచ్చే ఏడాది వేసవిలో మే ఒకటిన ఈ సినిమాను విడుదల చేస్తామని నిర్మాత ప్రశాంతి తిపిర్నేని చెప్పారు. ఈ సినిమాకు ఛాయాగ్రహణం: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జే మేయర్, ఎడిటింగ్: కార్తీక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైనర్: నాగేంద్ర తంగాల. లైన్ ప్రొడ్యూసర్: అభిలాష్ మాంధపు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్.వెంకటరత్నం.

బావ.. బావమరిది



తమిళ హీరోలు కార్తీ, అరవింద్ స్వామి నటించిన చిత్రం 'సత్యం.. సుందరం'. ఇంతకుముందు '96' చిత్రాన్ని రూపొందించి ప్రశంసలు అందుకొన్న సి.ప్రేమ్‌కుమార్ ఈ సినిమాకు దర్శకుడు. సూర్య, కార్తీ నిర్మించిన ఈ సినిమాను ఈ నెల 28న ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ తెలుగు ప్రేక్షకులకు అందిస్తోంది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో కార్తీ అమాయకత్వంతో కూడిన రస్టిక్ క్యారెక్టర్ చేస్తే, అరవింద్ స్వామి రిజర్వుడ్, అర్బన్ పర్సనాలిటీగా కనిపించారు. 'బావా.. బావా' అంటూ అరవింద్‌స్వామి వెంటపడుతూ ఆట పట్టించే టిపికల్ పాత్రను కార్తీ పోషించారు. వీరిద్దరూ పాల్గొన్న సన్నివేశాలతో రూపొందించిన టీజర్ అలరించింది. ఈ పాత్రలను దర్శకుడు అద్భుతంగా ప్రెజెంట్ చేశారు. శ్రీదివ్య, స్వాతి కొండే, దేవదర్శిని ముఖ్య పాత్రలు పోషించారు మహేంద్రన్ జయరాజ్ ఛాయాగ్రహణాన్ని, గోవింద్ వసంత సంగీతాన్ని అందించారు.

ఈసారి మహారాణి?



విజయ్ సేతుపతి కథానాయకుడిగా నటించిన 'మహారాజ' చిత్రం ఘన విజయంతో అటు పరిశ్రమ, ఇటు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు దర్శకుడు నితిలన్ స్వామినాథన్. ఆయన దర్శకత్వం వహించబోయే కొత్త చిత్రంలో నయనతార లీడ్‌రోల్ పోషిస్తున్నట్లు, ఆ చిత్రానికి 'మహారాణి' అనే టైటిల్‌ను అనుకుంటున్నట్లు కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మహిళా ప్రాధాన్య కథాంశంతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నయనతార పాత్ర కొత్తతరహాలో ఉండబోతోందని కోలీవుడ్ సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. 'మహారాజా' చిత్రాన్ని నిర్మించిన ప్యాషన్ స్టూడియోస్ పతాకంపై సుధన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



చంద్రబోస్‌కు పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం

పిల్లలను వారి అభిరుచులకు అనుగుణంగా ఆయా రంగాల్లో ప్రోత్సహించి ఉన్నత స్థాయికి చేర్చిన గొప్ప వ్యక్తి పొన్నం సత్తయ్య అని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్యగౌడ్ 14వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం సత్తయ్యగౌడ్ పురస్కారాలను ప్రదానం చేశారు. సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డుగ్రహీత చంద్రబోస్, బలగం ఫేమ్ కొమురమ్మ, మొగులయ్యలకు ఈ పురస్కారాలు ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలకు 51వేల రూపాయల నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పురస్కారగ్రహీతలను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా..

అల్లూరి కథ మరోసారి

తెల్లదొరలకు ముచ్చెమటలు పట్టించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు కథను హీరో కృష్ణ అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించిన సంగతి విదితమే. ఈ వీరుని కథ మరోసారి తీయడానికి ఆర్.వి.వి. సత్యనారాయణ పూనుకున్నారు. అల్లూరి జీవిత చరిత్రలో యథార్థ సంఘటనల్ని ప్రజలకు అందించాలనే సంకల్పంతో 'మన్యం ధీరుడు' పేరుతో రూపొందించిన ఈ సినిమాలో అల్లూరి పాత్రను సత్యనారాయణ పోషించారు. నరేశ్ డెక్కల దర్శకత్వంలో ఈ సినిమా రూపుదిద్దుకుంది. అరకు, పాడేరు, హిమాచల్ ప్రదేశ్, కశ్మీర్‌లో షూటింగ్ చేశారు. భారీ ఖర్చుతో ఒక ఊరినే నిర్మించి అక్కడ కీలక సన్నివేశాలను చిత్రీకరించామనీ, బానిస సంకెళ్లు తెంచుకుని బ్రిటీష్ తెల్లదొరల పాలనకు చరమగీతం పాడే సన్నివేశాలు అద్భుతంగా వచ్చాయనీ నిర్మాత సత్యనారాయణ చెప్పారు. ఈ నెల 20న సినిమాను విడుదల చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



మనసున్న తల్లి కథ



ఓ మధ్యతరగతి తల్లి చుట్టూ తిరిగే కథతో 'తల్లి మనసు' చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య దర్శకత్వంలో ఆయన తనయుడు కిశోర్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు వి. శ్రీనివాస్ (సిప్పి) దర్శకుడు. 'హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఇప్పటివరకూ జరిగిన షూటింగ్‌లో రెండు పాటలతో సహా 80 శాతం చిత్రం పూర్తయింది. ఇంకో పాట, మిగిలిన టాకీ పార్ట్ చిత్రీకరించడంతో ఈ నెలాఖరుకు షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. మా నాన్న చిత్రాల స్థాయికి తగ్గట్టుగా చక్కటి కథ, కథనాలతో సినిమా తీస్తున్నాం. ఇటువంటి కథాబలం ఉన్న మంచి చిత్రాన్ని తీస్తున్నందుకు సోషల్ మీడియా ద్వారా మంచి స్పందన లభిస్తోంది. అభినందనలు అందుతున్నాయి' అని నిర్మాత తెలిపారు. ఓ మధ్యతరగతి తల్లి పడే తపన, సంఘర్షణను ఇందులో ఆవిష్కరిస్తున్నట్లు దర్శకుడు చెప్పారు. సింగిల్ షెడ్యూల్‌లో చిత్ర నిర్మాణం పూర్తి చేస్తున్నట్లు ముత్యాల సుబ్బయ్య తెలిపారు.

వరద బాధితులకు విరాళం



'జెట్టి' సినిమాతో హీరోగా మంచి పేరు తెచ్చుకున్న నటుడు, '100 డ్రీమ్స్' పేరుతో ఎనిమిదేళ్లుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కృష్ణ మానినేని వరద బాధితుల సహాయం కోసం రూ. పది లక్షల విరాళం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలసి అందజేశారు కృష్ణ. '100 డ్రీమ్స్' ఫౌండేషన్ ద్వారా ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను విని, మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని పవన్‌కల్యాణ్ కోరారు

ధైర్యంగా ముందుకు రండి

నటి రోహిణి



కోలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్ అంశంపై ఫిర్యాదు చేసేందుకు వీలుగా నడిగర్ సంఘం ఆధ్వర్యంలో 2019లో ఏర్పాటు చేసిన విశాఖ కమిటీ ముందు బాధితులు బారులు తీరుతున్నట్లు ఆ కమిటీ అధ్యక్షురాలు, సినీ నటి రోహిణి తెలిపారు. ఈ విషయంపై ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. 'సినిమా అవకాశాల పేరుతో లైంగిక వేధింపులు ఎదుర్కొన్న అనేకమంది యువతులు కూడా ఫిర్యాదులు చేస్తున్నారని, వాటిపై సమగ్రంగా విచారణ జరుపుతున్నామని, ఆ విచారణ తర్వాత తదుపరి చర్యలపై ఆలోచన చేసి, ఓ నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇక లైంగిక వేధింపులపై ఫిర్యాదులు చేసిన వారి వివరాలను బహిర్గతం చేయమని, చిత్రపరిశ్రమలో లైంగిక వేధింపులు ఎదుర్కొన్నవారు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని రోహిణి సూచించారు. ఇదిలా ఉండగా, హీరోయిన్ల గురించి యూట్యూబ్ చానెల్‌లో ఇష్టానుసారంగా, అసభ్యకరంగా మాట్లాడిన డాక్టర్ కాంతరాజ్ అనే వైద్యుడిపై నటి రోహిణి నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటాం

● జేసీ భార్గవ్ తేజ



గుంటూరు సిటీ, సెప్టెంబరు 13: గుంటూరు జీడీసీసీ మహాజన సభ సమావేశంలో జరిగిన గందరగోళంపై జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ స్పందించారు. హాజరు కోసం అని తీసుకున్న సంతకాలు తీర్మానాలకు వర్తిస్తాయని జీడీసీసీ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో వివాదం మొదలైన సంగతి విదితమే. ఈ విషయాన్ని శుక్రవారం జేసీ దృష్టికి తీసుకెళ్లగా ఎజెండాలోని అంశాలు చదువుతున్నప్పుడు ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయలేదని చెప్పారు. సొసైటీ పర్సన్ ఇంఛార్జిలు అక్కడ అభ్యంతరం వ్యక్తం చేస్తే దాన్ని కూడా రికార్డు చేసే వాళ్లమని పేర్కొన్నారు. సమావేశం ముగిసిన తరువాత కొందరు పర్సన్ ఇంఛార్జిలు కొన్ని అంశాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ వినతి పత్రం విడుదల చేసినట్లు తన దృష్టికి వచ్చిందని జేసీ చెప్పారు. ఏ అంశాలపై వాళ్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారో వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. వారి అభ్యంతరాలను రికార్డు చేయిస్తానని తెలిపారు.

అంతా హడావుడి

గుంటూరు జీడీసీసీ బ్యాంకు సమావేశాల నిర్వహణపై తరచుగా ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. గత సమావేశంలో కూడా అభ్యంతరకర అంశాలను ఎజెండాలో చేర్చి ఆమోదింప చేసేందుకు అధికారులు చాలా ప్రయత్నాలు చేశారు. కొందరు సభ్యులు వాటిని వ్యతిరేకించటంతో గొడవ జరిగింది. పాత ప్రభుత్వ హయాంలో రూ.లక్షల మామూళ్లు పుచ్చుకుని సుమారు 60 మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. వారిని ఉద్యోగంలోకి తీసుకునేటప్పుడు తీర్మానం ప్రవేశ పెట్టి పాలకవర్గం అనుమతి పొందాలి. ఇదేమి లేకుండా ఇష్టానుసారంగా నియామకాలు చేపట్టారు. కోట్లు చేతులు మారిన ఈ వ్యవహారంలో అధికారుల పాత్ర కీలకం అని తెలుస్తోంది. గత సమావేశంలో సదరు తీర్మానం పక్కన పెట్టటంతో దొడ్డి దారిన జరిగిన నియామకాలను శిక్షణ పేరుతో సరిచేసేందుకు ప్రయత్నం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

18న అరుణాచలంకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

గుంటూరు, సెప్టెంబరు 13: ఈనెల 18న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు భక్తుల కోసం ఆర్టీసీ స్పెషల్ హైటెక్ 2+2 పుష్ బ్యాక్ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-1 డిపో మేనేజర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 16న రాత్రి 9.45 గంటలకు బయల్దేరి 17వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్‌టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడే బస చేసి 18న పౌర్ణమి రోజున అరుణాచలంనకు చేరుకుంటుందన్నారు. అదే రోజు సాయంత్రం బయల్దేరి 19వ తేదీన ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96779 సర్వీసుకు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కోఛార్జీ రూ.2420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382825420 సంప్రదించాలని కోరారు.

గంజాయి పట్టివేత?

దాచేపల్లి, సెప్టెంబరు 13: హైదరాబాద్ నుంచి మేదరమెట్ల ప్రయాణం చేస్తున్న బస్సులో గంజాయి తయారీకి ఉపయోగించే ఆకును ప్యాకెట్‌లలో తరలిస్తుండగా దాచేపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. శుక్రవారం స్థానికుల నుంచి సేకరించిన వివరాల ప్రకారం.. పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో బస్సులో ప్రయాణం చేస్తున్న ఓ యువకుడి వద్ద గంజాయికి సంబంధించి గంజాయి తయారు చేసే ముడిపదార్థం ప్యాకెట్ ను స్వాధీనం చేసుకున్నారు. వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై దాచేపల్లి సీఐ గుత్తి వెంకట్రావును వివరణ కోరగా అటువంటిది ఏమీ లేదని తెలిపారు. కాగా దీనిపై విచారణ జరుగుతున్నట్లు సమాచారం.

విపత్తు వేళ.. విరాళాల వెల్లువ

● సీఎం చంద్రబాబుకు చెక్కులు అందజేత
● దాతలను అభినందించిన ముఖ్యమంత్రి

పూర్ణచంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో..


సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న కృష్ణమోహన్

గుంటూరు, సెప్టెంబరు 13: వరద బాధితులకు సహాయం చేసేందుకు పూర్ణచంద్ర ఫౌండేషన్ ముందుకొచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన బొల్లినేని కృష్ణమోహన్ తన తండ్రి పేరుతో ఏర్పాటు చేసిన ఫౌండేషన్ నుంచి రూ. 1.25 కోట్ల చెక్కును శుక్రవారం క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబుకు అందజేశారు. కాగా కృష్ణమోహన్ తండ్రి దివంగత డాక్టర్ పూర్ణచంద్రరావు గతంలో గుంటూరు జిల్లా డీఎమ్‌హెచ్‌వోగా పనిచేశారు.

తులసీ సీడ్స్ ఆధ్వర్యంలో..

గుంటూరు, సెప్టెంబరు 13: వరద బాధితుల సహాయార్థం తులసీ సీడ్స్ సంస్థ భారీ విరాళాన్ని అందజేసింది. తులసీ సంస్థల చైర్మన్ తులసీ రామచంద్రప్రభు, ఆయన తనయుడు తులసీ సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ తులసీ యోగీష్ శుక్రవారం క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి రూ. కోటి చెక్కును అందజేశారు. అలానే ఏటుకూరు మాజీ సర్పంచి ఉగ్గిరాల సీతారామయ్య తమ వంతు సహాయంగా రూ. 2 లక్షల చెక్కును ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చంద్రబాబుకు అందజేశారు. అదేవిధంగా తులసీ గ్రూప్ ఉద్యోగులు తమ ఒకరోజు వేతనం రూ. 5 లక్షల రూ. 43వేలను చెక్కు రూపంలో తులసి గ్రూపు సంస్థల్లో ఒకటైన డైహార్డ్ డైస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రొడక్షన్ మేనేజర్ పచ్చా వాసుదేవ్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. 2009లో కూడా కర్నూలు వరద బాధితుల సహాయార్థం రూ. 50 లక్షల విరాళాన్ని తులసీ సీడ్స్ అందజేసిందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తమవంతు సహాయాన్ని అందజేయటానికి తులసి సీడ్స్ ఎప్పుడూ ముందుంటుందని తులసి రామచంద్ర ప్రభు తెలియజేశారు.


సీఎంకు చెక్కు అందజేస్తున్న తులసీ రామచంద్రప్రభు, తులసీ యోగీష్

ఎమ్మెల్యే శ్రావణ్‌కు రూ.2 లక్షల చెక్కు అందజేత

తుళ్లూరు, సెప్టెంబరు 13: బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కి రూ.2 లక్షల చెక్కును తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌కు శుక్రవారం గుంటూరు కార్యాలయంలో అందజేశారు. నేలపాడు గ్రామానికి చెందిన గుజర్లపూడి రాజేశ్వరి కుటుంబం లక్ష, మన్నం లక్ష్మణరావుకు (యూఎస్ఏ) చెందిన కుటుంబం లక్ష చొప్పున చెక్కులు అందజేశారు. వరద బాధితులను అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని, దాతలు కూడా సహాయం చేస్తున్నారని, వారికి కూటమి ప్రభుత్వం తరుపున అభినందనలు చెబుతున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ అన్నారు.

కార్పెంటర్స్ చేయూత

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 13: విజయవాడ వరద బాధితులకు కార్పెంటర్స్ అండగా నిలిచారు. ది స్టేట్ కార్పెంటర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్పెంటర్ల నుంచి సేకరించిన రూ.1,15,000 రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు పిలుపు మేరకు ఈ సాయం అందజేయడానికి ముందుకు వచ్చామని చెప్పారు. ఈ సందర్భంగా పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఉంటూ జీవనోపాధి సాగిస్తున్న కార్పెంటర్లు సీఎం సహాయనిధికి ఆర్థిక సాయం అందజేయడం అభినందనీయమని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారని ఆయన తెలిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి పఠాన్ నాయబ్ రసూల్, కోశాధికారి మోహన్‌రావు, సభ్యులు అంబికా పతి, లాక్కోజు సింహాచలం, సురేంద్రబాబు, మోహన్ ఆచారి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌కు చెక్కు అందజేస్తున్న దాతలు గుజర్లపూడి రాజేశ్వరి, మన్నం లక్ష్మీనారాయణ


చంద్రబాబు నాయుడుకు చెక్కు అందజేస్తున్న కార్పెంటర్స్ వర్కర్స్ యూనియన్ సభ్యులు

కేజీబీవీలో ఎలుకల సంచారంపై బాలికల ఫిర్యాదు

ఆర్డీవో జీవీ రమణకాంత్‌రెడ్డి సందర్శన


కేజీబీవీ హాస్టల్ సిబ్బందికి సూచనలిస్తున్న గురజాల ఆర్డీవో జీవీ రమణకాంత్‌రెడ్డి

రెంటచింతల, సెప్టెంబరు 13: మండలంలోని మిట్టగుడిపాడు కేజీబీవీలో ఎలుకలు సంచరిస్తున్నాయని, కొద్దిమందిని కరిచాయని బాలికలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో గురజాల ఆర్డీవో జీవీ.రమణకాంత్‌రెడ్డి, డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖాధికారి పద్మావతి, జీసీడీవో రేవతి, తహసీల్దార్ కరుణకుమార్ శుక్రవారం కేజీబీవీని సందర్శించారు. సుమారు 3 గంటల పాటు హైస్కూల్, జూనియర్ కళాశాల బాలికలతో ఆర్డీవో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గురు, శుక్రవారాల్లో నిద్రిస్తున్న తమను ఎలుకలు కరిచాయని, వెంటనే చికిత్స చేయించారని బాధితులు ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో హాస్టల్‌లోని వంటగదులు, బియ్యం నిల్వ ఉంచే ప్రదేశాన్ని, భోజనం వండే తీరును,పిల్లలకు ఏ పరిమాణంలో భోజనం వడ్డిస్తున్నారనే దానిని స్వయంగా పరిశీలించారు. పాఠశాలంతా రాళ్లతో నిండి ఉండటం ఏంటని ప్రిన్సిపాల్ రాజకుమారిని ప్రశ్నించారు. ఇలాగైతే విద్యార్థులు ఆటలు ఎలా ఆడతారని అడిగారు. అలాగే మూలన పడి ఉన్న సోలార్ సిస్టంపై ప్రశ్నించారు. వార్డెన్, టీచర్ విధులను నిక్కచ్చిగా నిర్వహించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రాత్రి వేళల్లో కనిపెట్టుకుని ఉండాలని ఆదేశించారు. 50 గ్రాములు ఉండాల్సిన గుడ్డు పరిమాణం 42 గ్రాములుండటంపై కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీలో డాక్టర్ కృష్ణారెడ్డి, ఎంఈవో 2 శివ నాగేశ్వరరావు, ఆర్ఐ కాంతారావు, ఎంపీహెచ్‌వో శర్మ, హనుమకుమార్, వీఆర్వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో స్టాఫ్ నర్సుల నిరసన ప్రదర్శన

● జీవో నం.115 రద్దు చేయాలని డిమాండ్


నిరసన శిబిరంలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 13: ప్రభుత్వాస్పత్రుల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేస్తున్న స్టాఫ్ నర్సులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో శుక్రవారం కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అడ్మినిస్ట్రేషన్ ఛాంబర్ ఎదుట టెంట్ వేసి అందులో నర్సులు బైఠాయించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీవో నంబర్ 115 రద్దు చేయాలని కాంట్రాక్ట్ నర్సులు డిమాండ్ చేశారు. ప్రభుత్వాస్పత్రుల్లో గత 15 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న తమను కాదని, జీఎన్ఎంగా కొద్దిపాటి శిక్షణ పొంది ఏఎన్ఎంలుగా పని చేస్తున్న వారిని నియమించడం సరికాదని వారు తెలిపారు. గత ప్రభుత్వం అక్రమంగా ఈ జీవో ఇచ్చినట్లు వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం స్పందించి దీర్ఘకాలంగా పని చేస్తున్న తమ సేవలను గుర్తించి రెగ్యులర్ స్టాఫ్ నర్సు పోస్టుల్లో తమనే నియమించాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాంట్రాక్ట్ నర్సులతో పాటు వివిధ ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొని మద్దతు తెలిపారు.

అమ్మవారికి బంగారు ఆభరణం బహూకరణ


బంగారు హారాన్ని ఈవో గోపికి అందజేస్తున్న దాతలు

అమరావతి, సెప్టెంబరు 13: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో అమ్మవారికి గుంటూరుకు చెందిన శ్రీషిర్డీ సాయిబాబా వెజిటబుల్స్ హోల్‌సేల్ మర్చంట్ అధినేత అడపా బృహస్పతిరావు పార్వతీ దంపతులు 39 గ్రాముల బంగారు మామిడి పిందెల హారాన్ని బహూకరించారు. సుమారు రూ.2.3 లక్షల విలువైన హారాన్ని ఈవో వేమూరి గోపికి అందజేశారు. హారానికి పూజలు నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. అనంతరం దాతల పేరున స్వామివార్లకు పూజలు నిర్వహించి ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన ఉప ప్రధాన అర్చకులు కె.సుధీర్‌శర్మ, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

కిడ్నీ క్యాన్సర్‌కి అరుదైన శస్త్రచికిత్స


వ్యాధిని నయం చేసిన యూరాలజిస్టు డాక్టర్ వెంకట నాయుడు, పక్కన రోగి వెంకయ్య

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మూత్రపిండానికి క్యాన్సర్ సోకడంతో ఏర్పడిన కణతిని అరుదైన శస్త్రచికిత్స చేసి వైద్యులు తొలగించారు. గుంటూరు నగరంలోని పెదకాకాని రోడ్డులోని గుంటూరు కిడ్నీ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ల్యాప్రోస్కోపీ పద్ధతి ద్వారా కిడ్నీలో క్యాన్సర్ కణతిని విభిన్నమైన పద్ధతిలో శస్త్రచికిత్స చేసి క్యాన్సర్ రోగాన్ని నయం చేశారు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలంలోని ముప్పరాజువారిపాలెంకు చెందిన కె.వెంకయ్య అనే వ్యక్తికి కుడివైపు కిడ్నీలో క్యాన్సర్ కణతి ఏర్పడింది. దాంతో అతను తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. పలు ఆస్పత్రుల్లో వైద్యం కోసం సంప్రదిస్తే కోత విధానం ద్వారా కిడ్నీ మొత్తం తీసేయాలని చెప్పడంతో చివరిగా గుంటూరు కిడ్నీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు వచ్చి సీనియర్ యూరాలజిస్టు డాక్టర్ వి.వెంకటనాయుడుని సంప్రదించారు. ఆయన ల్యాప్రోస్కోపీ విధానం ద్వారా కిడ్నీలో క్యాన్సర్ కణతిని మాత్రమే తొలగించి వ్యాధిని నయం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం డాక్టర్ వెంకటనాయుడు మాట్లాడుతూ ఇదొక అరుదైన శస్త్రచికిత్స అని చెప్పారు.

సీనియర్ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

గుంటూరు సెప్టెంబర్ 13 స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రమౌళి నగర్ ఏడో లైన్లో కార్పొరేట్ కళాశాలకు చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థిని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇటీవల ఆమె హోం సిక్‌కి ఇంటికి వెళ్లింది. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఇంటి నుంచి హాస్టల్‌కు వచ్చింది. ఆమె మేనమామ హాస్టల్‌లో దించి వెళ్లారు. రాత్రి 7 గంటల సమయంలో హాస్టల్‌లో ఉరివేసుకొని కనిపించింది. వెంటనే చికిత్స నిమిత్తం జీజీహెచ్ కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలు రాజుపాలెం మండలం అంచులవారిపాలెం గ్రామానికి చెందిన వేపూరి దివ్య(17)గా పోలీసులు తెలిపారు. తండ్రి సాంబశివరావుకు పోలీసులు సమాచారం అందించారు. దివ్యకు ఆరోగ్యం సరిగా ఉండటం లేదనీ, కడుపునొప్పి వాంతులతో బాధ పడుతుంటుందని ఆమె రూమ్‌మేట్స్ పోలీసులకు తెలిపారు. అంతేగాక ఆమెకు తరచూ తలనొప్పి వస్తుంటుందని, హాస్టల్ ఆహారం సరిపడేది కాదని వారు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని తోటి స్నేహితులు తెలిపారు. రాత్రి 7 గంటల సమయంలో దివ్య ఇడ్లీ తెచ్చుకునేందుకు అవసరమైన డబ్బుల కోసం స్టడీ అవర్ నుంచి హాస్టల్‌కు వెళ్లింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వీరేంద్ర తెలిపారు.

మెప్మాలో డిజిటల్ ఛాంపియన్‌లు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 13: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో సమూల మార్పునకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డిజిటల్ ఛాంపియన్‌లను నియమించేందుకు రంగం సిద్ధమైంది. ప్రతి 100 కుటుంబాలకు ఒక డిజిటల్ ఛాంపియన్‌ను నియమిస్తారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం కల్పిస్తారు. డిజిటల్ ఛాంపియన్ నియామక ముఖ్యఉద్దేశం ఆ క్లస్టర్లో 100 కుటుంబాలకి ప్రతినిధిగా ఉండి ప్రజల అనుమతితో వారి మొబైల్‌లో ఈ -యాప్ ఇనస్టాల్ చేయిస్తారు. ఈ యాప్ ద్వారా ప్రజల కనీస అవసరాలు, సమస్యలు పరిష్కరించేందుకు ఏర్పాటు చేస్తారు. ముఖ్యంగా ప్రతి కుటుంబం సైబర్ నేరాల బారిన పడకుండా డిజిటల్ లావాదేవీలు నిర్వహించేలా ప్రజలకు అవగాహన కల్పించటం, కుటుంబ అవసరాలకు అందుబాటులో ఉన్న గుర్తింపు పొందిన వివిధ రకాల యాప్ నిర్వహించుకునేలా శిక్షణ ఇస్తారు. ప్రస్తుతం విజయవాడ పరిధిలో 4 వేల మంది డిజిటల్ ఛాంపియన్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

రేపటి నుంచి మెక్సికో బృందం పర్యటన

గుంటూరు సిటీ, సెప్టెంబరు 13: రాష్ట్రంలో అమలవుతున్న 'ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ' కార్యక్రమాన్ని పరిశీలించేందుకు మెక్సికో ప్రతినిధి బృందం పర్యటించనున్నట్లు రైతు సాధికార సంస్థ శుక్రవారం తెలిపింది. ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు వారం రోజుల పాటు రాష్ట్రంలో అమలవుతున్న ఏపీసీఎన్ఎఫ్ కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్థం చేసుకుంటారని వెల్లడించారు. మెక్సికో దేశంలో ప్రకృతి వ్యవసాయ మోడల్‌ను అమలు చేయాలనే ఉద్దేశంతో ఈ బృందం రాష్ట్రంలో పర్యటిస్తోందని రైతు సాధికారిక సంస్థ పేర్కొంది. మొదట తిరుపతి, ఆ తర్వాత 18వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఏలూరు జిల్లాలోని కోకో, కొబ్బరి, వరి, ఆయిల్ పామ్, కూరగాయల క్షేత్రాలను సందర్శిస్తారని తెలిపారు.


ఆర్అండ్‌బీ పరిధిలోకి పలు పీఆర్ రోడ్లు

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ నుంచి పలు రోడ్లను ఆర్అండ్‌బీకి ప్రభుత్వం బదలాయింది. తద్వారా ఆయా రోడ్లకు ఆ శాఖ కొత్త కోడ్ నంబర్లు ఇవ్వడంతోపాటు ఇక నుంచి వాటి నిర్వహణ బాధ్యతలను చూసుకోనుంది. గుంటూరు జిల్లాలో మంగళగిరి వద్ద ఉన్న పాత మద్రాసు - కోల్‌కత్తా హైవే నుంచి ఎయిమ్స్ పశ్చిమ వైపున ప్రవేశ ద్వారం వరకు 500 మీటర్ల పొడవునా ఆర్అండ్‌బీ స్వాధీనం చేసుకొని జీటీఎండీ-226 కోడ్‌ని కేటాయించింది. పల్నాడు జిల్లాలో పిడుగురాళ్ల - జూలకల్లు 5.748 కిలో మీటర్లు(కోడ్ నంబరు. జీటీవోడి-056), కొండవీడు కోట ఘాట్ రోడ్డు 5.710 (జీటీవోడీ-057), ఎన్‌హెచ్-16 నుంచి ఉన్నవ వయా మర్రిపాలెం 1.850 (జీటీవోడీ-058), నరసరావుపేట - వినుకొండ ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి కాకాని పొలాల వరకు 1.500 (జీటీఎండీ-227), పాత నార్కెట్‌పల్లి - అద్దంకి - మేదరమెట్ల రోడ్డులో 1.200 (జీటీఎండీ-228), రాజుపాలెం - అమరావతి రోడ్డు 49.700 కిలోమీటర్ల రోడ్డు (జీటీఎండీ-229)ని మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లుగా అప్‌గ్రేడ్ చేసింది. కాగా జీటీఎండీ కోడ్ ఉన్నవి మేజర్ డిస్ట్రిక్ రోడ్లు, జీటీవోడీ కోడ్ ఉన్న వాటిని ఇతర జిల్లాల రోడ్లుగా పరిగణిస్తారు.

డీలర్ నియామకం : టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ

నరసరావుపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్ల మండల టీడీపీలో ఘర్షణ వాతావరణం నెలకొంది. గ్రామల్లో డీలర్ల నియామకం, డీలర్ల వద్ద బియ్యం కొనుగోలు అంశాల్లో పార్టీ శ్రేణుల మధ్య వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణుల మధ్య నరసరావుపేటలో శుక్రవారం ఘర్షణ జరిగింది. టీడీపీ మండల అధ్యక్షుడు జగ్గయ్యపై పార్టీలోని మరో వర్గం దాడి చేసింది. రొంపిచర్ల మండలం సుబ్బయ్యపాలెంలో డీలర్ నియామకం విషయంలో ఇరు వర్గాల మధ్య కొద్ది రోజులుగా వివాదం జరుగుతోంది. డీలర్‌ను నియమించే విషయంలో జగ్గయ్య జోక్యం చేసుకున్నాడని సదరు వర్గం ఆరోపిస్తోంది. గ్రామంలోని ఒక వర్గంకు చెందిన వ్యక్తిని రేషన్ డీలర్‌గా నియమించారు. అయితే దీనిని మరో వర్గం వ్యతిరేకించింది. తమ వర్గానికే డీలర్ కేటాయించాలని కోరుతోంది. దీనిపై కొంతకాలంగా వివాదం జరుగుతుంది. తమ వర్గానికి కాకుండా జగ్గయ్య మరో వర్గానికి సహకరిస్తున్నాడని, డీలర్‌గా నియమించాలని కోరుతున్న పార్టీ కార్యకర్తను బెదిరించాడని పార్టీ వర్గాలు తెలిపాయి. తమ వర్గానికి చెందిన వ్యక్తిని బెదిరించడాన్ని జీర్ణించుకోలేని వారు జగ్గయ్యను నిలదీశారు. మాటమాట పెరిగిన నేపథ్యంలో జగ్గయ్యపై దాడి చేసినట్టు చెబుతున్నారు. ఈ సంఘటన మండల పార్టీలో లుకలుకలు బయటపెట్టింది.

ప్రకాశం బ్యారేజి దిగువకు 1,12,195 క్యూసెక్కులు



తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 13: ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండటంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువున ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 1,16,607 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.8 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 50 గేట్లను 3 అడుగుల మేర, 7 గేట్లను 2 అడుగులు ఎత్తి దిగువకు 1,12,195 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 4,412 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

41,775 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 40,880 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 41,775 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 16,190 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	16500	334	8000	17000
నెంబరు. 5	8000	16000	నెంబరు. 5	9000	11500
273	7500	13500	273	7000	7000
341	7500	16000	341	7500	16500
4884	12000	12000	4884	11000	14500
సూపర్ 10	12700	15000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18600	తేజ	8000	18500
బ్యాడిగి	7500	16000	బ్యాడిగి	8500	15000
దేవనూరు డీలక్స్	8000	14500	దేవనూరు డీలక్స్	11000	15500
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	4500	10500

వందేభారత్ రైలుకు బాపట్లలో స్టాప్ ఇవ్వాలని ఎంపీ వినతి



ఢిల్లీలో రైల్వేబోర్డు ఛైర్మన్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్

బాపట్ల, సెప్టెంబరు 13 : బాపట్ల రైల్వేస్టేషన్‌లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాప్ ఇవ్వాలని కోరుతూ ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ శుక్రవారం ఢిల్లీలో రైల్వేబోర్డుఛైర్మన్ సతీష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్ళే ఈ రైలు బాపట్ల జిల్లా కేంద్రం, పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రం కావున ఆగేవిధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. వందేభారత్ రైలుకు స్టాప్ ఇవ్వటం వల్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఉద్యోగులకు, వ్యాపారులకు, తిరుపతి వెళ్ళే భక్తులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఎంపీ కృష్ణప్రసాద్ వివరించారు.

వరదలకు దెబ్బతిన్న గృహాల సర్వే పారదర్శకంగా చేపట్టాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, సెప్టెంబరు 13 : వరద విపత్తుతో దెబ్బతిన్న గృహాల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. లంక గ్రామాలలో ఇంటింటా సర్వేపై శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందితో వీక్షణా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణానది వరదకు జిల్లాలోని లంక గ్రామాలు అధికంగా దెబ్బతిన్నాయన్నారు. 24 లంక గ్రామాలలోని నష్టాన్ని సర్వే లో క్షుణ్ణంగా నమోదు చేయాలన్నారు. నష్టం అంచనాల సర్వే కొరకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ప్రభుత్వం సూచించిందన్నారు. ఇందుకోసం నూతన యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. దెబ్బతిన్న గృహం వివరాలను స్పష్టంగా పొందుపర్చాలన్నారు. ఆ ఇంట్లో టివి, ఫ్రిజ్ దెబ్బతింటే వాటి కంపెనీ పేర్లతో సహా వివరాలు నమోదు చేయాలన్నారు. ఎవరివైన వాహనాలు దెబ్బతింటే సర్వేయాప్‌లో వాటి ఫొటోలు తీయాలని, సదరు వాహనం కంపెనీ పేరును నిక్షిప్తం చేయాలన్నారు. ప్రాథమికంగా 13 పక్కా గృహాలు దెబ్బతినగా 163 కచ్చా గృహాలు, మరికొన్ని గృహాలు దెబ్బతిన్నాయన్నారు. జీవనోపాధి కోల్పోయి ఉంటే వాటి ఫొటోలను తీసి యాప్‌లో పంపాలన్నారు. పశువులకు సంబంధించి షెడ్యూల్ వివరాలు పొందుపర్చాలన్నారు. లంకగ్రామాలలో కొందరికి ఆధార్ కార్డులు, బ్యాంక్ ఖాతాలు లేవని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. యుద్ధప్రాతిపదికన వారికి బ్యాంక్ ఖాతాలు తెరిచి ఆధార్‌కార్డులు ఇప్పించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయాలలోని 11 మంది సిబ్బంది మొత్తం సర్వే పనులలో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, రేపల్లె ఆర్డీవో హేలాషారోను, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

బాపట్ల, సెప్టెంబరు 13 : విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని డిప్యూటీ ఈవో జి.వెంకటేశ్వర్లు తెలిపారు. వికసిత్‌భారత్‌లో భాగంగా శుక్రవారం వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 అనే అంశంపై జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. స్థానిక ఏబీవీ పాఠశాలలో నిర్వహించిన ఈపోటీలలో విజేతలకు సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు. వక్తృత్వపోటీలలో జి.మురళీ కృష్ణసాయిరాం (బూదవాడ హైస్కూల్) ప్రథమ స్థానాన్ని, బి.దివ్యతేజశ్రీ (కొల్లూరు హైస్కూల్) ద్వితీయ స్థానం, జి.కవిత (ఉల్లిపాలెం హైస్కూల్) తృతీయ స్థానం కైవశం చేసుకున్నారు. వ్యాసరచన పోటీలలో కె.లక్ష్మీసిందూర (ఉల్లిపాలెం హైస్కూల్) ప్రథమస్థానం, ఎ.తన్మయి (తిమ్మాయపాలెం హైస్కూల్) ద్వితీయ స్థానం, డి.రవికిషోర్ (నిజాంపట్నం బీసీ వెల్ఫేర్ స్కూల్) తృతీయ బహుమతి సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డిప్యూటీ ఈవో అభినందించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఎస్‌కెఎస్ జాన్‌సైదా, పి.రమ్యలత, ఐసీహెచ్ డానీయేలు, వైసత్యవతి వ్యవహరించారు. కార్యక్రమంలో సాధిక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలి

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 13 : మండలంలోని 14గ్రామపంచాయతీల పరిధిలో ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిట్టలవానిపాలెం మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి భవనం మారుతిశేషమాంబ తెలిపారు. కార్యక్రమాల పర్యవేక్షణకు విస్తరణాధికారి కె.పద్మజ, కె.భాగ్యరాజు, ఏపీవో సంతోష్‌కుమార్, ఏపీఎం సుభాషిణి పాల్గొంటారని తెలిపారు.

కర్లపాలెంలో బీజేపీ సభ్యత్వం నమోదు

కర్లపాలెం,సెప్టెంబరు 13 : కర్లపాలెం ఐలెండ్ సెంటర్‌లో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్నిపార్టీ మండల అధ్యక్షుడు పిట్టు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కె.మణియాదవ్, ప్రధాన కార్యదర్శి వల్లూరి భావన్నారాయణ, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ శ్రీనివాసరాజు, మండల ప్రధాన కార్యదర్శి పిట్ల శ్రీనివాసరెడ్డి (ఎర్ర శ్రీను), మండల ఉపాధ్యక్షుడు నందిపాటి శివనాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

యాజలిలో అన్న సంతర్పణ

కర్లపాలెం, సెప్టెంబరు 13 : మండలంలోని యాజలి గ్రామంలో గౌడ సంఘం, యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా కల్లు గీత కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ తాతా జయప్రకాష్ నారాయణ పాల్గొని ప్రారంభించారు. గౌడ సంఘీయులు తాతా జయప్రకాష్ నారాయణను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

అవినీతిలేని పాలన అందించటమే లక్ష్యం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

● మధ్యవర్తులను గుర్తించి లంచాలు వెనక్కి ఇప్పించాం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, సెప్టెంబరు 13 : అధికారుల పేర్లు చెప్పి లంచాలు వసూళ్ళు చేస్తున్న మధ్యవర్తులను గుర్తించి డబ్బులు తిరిగి వెనక్కి ఇప్పించటం జరిగిందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు అయిన సందర్భంగా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీశ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నరేంద్రవర్మ మాట్లాడుతూ బాపట్లలో జరిగిన ఈ సంఘటన పూర్తిగా అధికారుల వల్ల జరిగిందని అనుకోవటంలేదన్నారు. మధ్యవర్తులే ప్రలోభాలకు గురి చేయాలని చూశారన్నారు. అవినీతిలేని పాలన అందించటమే లక్ష్యంగా పని చేస్తానన్నారు.

వారంలో ఐదు రోజులు ప్రజలకు అందుబాటులో...

వారంలో 5 రోజులు ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. సోమ, మంగళవారాలలో ఉదయం 8 గంటలు నుంచి 11 గంటల వరకు టీడీపీ కార్యాలయంలో ఉండి పట్టణ ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించటం జరుగుతుందన్నారు. బుధవారం బాపట్ల మండల ప్రజలకు, గురువారం కర్లపాలెం మండల ప్రజలకు, శుక్రవారం పిట్టలవానిపాలెం మండల ప్రజలకు అందుబాటులో ఉండటం జరుగుతుందన్నారు. ప్రతి శనివారం ఒకవార్డు లేదా ఒక గ్రామంలో పర్యటించి క్షేత్రస్థాయి సందర్శన ద్వారా ప్రజా సమస్యలపై పార్టీశ్రేణులు, ప్రజలతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మెడికల్ కళాశాల పూర్తి అవుతుంది

బాపట్లలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పూర్తవుతాయని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. పీపీపీ మోడ్‌లో చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. ఈ కొత్తవిధానంతో కళాశాల నిర్మాణం పూర్తి చేయటం జరుగుతుందన్నారు. బాపట్ల ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ ద్వారా రోగులకు మెరుగైన సేవలందించే విధంగా చర్యలు చేపడుతామన్నారు.

రియల్ ఎస్టేట్ ఆరోపణలు సరికాదు

రియల్ ఎస్టేట్ వ్యాపారులు గతంలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రకటనలు ఇవ్వటం జరిగిందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ఈ విషయంలో తాను వ్యక్తిగతంగా రియల్ ఎస్టేట్‌వ్యాపారుల పేర్లతో ప్రకటన ఇప్పించాననే ఆరోపణ సరికాదన్నారు. రాష్ట్ర మంత్రి నారాయణ ఆదేశాల మేరకు అక్రమ లేఅవుట్‌లపై అధికారులు ప్రకటన ఇవ్వటం జరిగిందన్నారు. దీనిపై వైసీపీ శ్రేణులు తనపై ఆరోపణలు చేయటం సరికాదన్నారు. గతంలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లపై అవకాశం ఇప్పించే విధంగా మంత్రి నారాయణతో మాట్లాడుతానన్నారు. సూర్యలంక-ఓడరేవు రోడ్డు ఏర్పాటు చేయటంతో పాటు రిసార్ట్, ఫైవ్‌స్టార్ హోటల్ అందుబాటులోకి తెచ్చి తీరప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. నిజాంపట్నం నుంచి ఓడరేవు వరకు సముద్ర అంచున ఉన్న డ్రైన్‌ను అభివృద్ధి చేసి టూరిజాన్ని ప్రోత్సహిస్తామన్నారు. పట్టణంలోని పార్కులు మొత్తం అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండల పార్టీ అధ్యక్షులు వై.భూపతిరావు, ఎండీ అఫ్జల్, సీనియర్ నాయకులు మందపాటి ఆంద్రేయ, భోగిరెడ్డి రమేష్‌రెడ్డి, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తానికొండ దయాబాబు, మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

మనసు కవి ఆత్రేయ : రావూరి

బాపట్ల,సెప్టెంబరు 13 : తెలుగు సాహితీ జగత్తులో మనసులను కలబోసి మమతలని పెనవేసిన మనసు కవి ఆత్రేయ అని, శ్రామిక జీవులు పడుతున్న బాధలు చూచి తన కలాన్ని బలంగా కదిలించిన మహాకవి ఆత్రేయ అని సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. ఆత్రేయ 35వ వర్ధంతి సభలో శుక్రవారం సాహితిభారతి కోశాధికారి ఆదంషఫి, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు, ప్రజాకవి డాక్టర్ శ్రీనివాసలు సంయుక్తంగా మాట్లాడేరు. అనంతరం పువ్వాడ వెంకటేశ్వర్లు, కామరాజు కాశీదాసు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తిలు ఆత్రేయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముస్లింలకు రక్షణ కల్పించాలంటూ వినతి

బాపట్ల, సెప్టెంబరు 13 : బీజేపీ ప్రభుత్వ విధానాల నుంచి ముస్లింలకు రక్షణ కల్పించాలని కోరుతూ పిట్టలవానిపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎండి అఫ్జల్ ముస్లిం మైనార్టీ నాయకులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు వినతిపత్రం అందజేశారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్టసవరణ బిల్లును అమలు పరచకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చందోలు గ్రామ పార్టీ అధ్యక్షుడు రజాక్, జావీర్, ఇక్బాల్, ఇనాయతుల్లాబేగ్, పక్రుద్దీన్, షేక్ బాషా, ఫరూక్, జబ్బార్, అమీరుద్దీన్, గౌస్‌బేగ్ తదితరులు ఉన్నారు.

జీవో 115ను వెనక్కి తీసుకోవాలి

బాపట్ల, సెప్టెంబరు 13 : వైద్యఆరోగ్యశాఖలో స్టాఫ్ నర్సు క్యాడర్‌కు అన్యాయం జరుగుతున్న జీవో 115 వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కూరపాటి సత్యంరాజు, బడుగు శివాజి కోరారు. ఈ విషయమై శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై మంత్రులు, అధికారులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు ఉషా, సౌమ్య, కళ్యాణి, వినీలా, కరుణ, మస్తాన్‌బి, కల్పన, జానకి పాల్గొన్నారు.

లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్‌లో జాతీయ హిందీ దినోత్సవం

బాపట్ల,సెప్టెంబరు 13 : జాతీయ హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్‌లో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు హిందీ అనే అక్షరాలుగా కూర్చొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సబాస్టియన్, ఉపాధ్యాయులు అబ్దుల్ రహమాన్, రమేష్‌కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా జ్వర పీడితుల గుర్తింపు

బాపట్ల, సెప్టెంబరు 13 : భారీవర్షాల వల్ల నిలిచిన నీటితో జ్వరాలు, అంటువ్యాధులు సోకిన వారి వివరాలు తెలుసుకునేందుకు శుక్రవారం ఇంటింటా సర్వే చేపట్టారు. పట్టణంలోని రాజీవ్‌గాంధీకాలనీ, వివేకానందకాలనీలలో పట్టణ హెల్త్ సూపర్‌వైజర్ జూగుంట రాంబాబు ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే చేశారు. అవసరమైన వారికి మలేరియా పరీక్షలు నిర్వహించారు. అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రాజ్యలక్ష్మి, అతిమిల, పద్మావతి, కృష్ణవేణి పాల్గొన్నారు.

ముగిసిన రెండురోజుల నాక్ ఇన్‌స్పెక్షన్

బాపట్లరూరల్, సెప్టెంబరు 13 : బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీ ప్రమాణాలను పరిశీలించటానికి అఖిలభారత స్వాతంత్ర పర్యవేక్షక సంస్థ తరుపున టీమ్ సభ్యులు డాక్టర్ రంజిత్ సింగ్, డాక్టర్ ప్రమోద్, డాక్టర్ సంజయ్‌లతో కూడిన త్రిసభ్య బృందం రెండు రోజుల నుంచి కళాశాలను సందర్శించి తమ నివేదికను సమర్పించటం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి తెలిపారు. కళాశాల ప్రమాణాలు, సౌకర్యాల వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు.

సామూహిక కుంకుమార్చన

బాపట్ల, సెప్టెంబరు 13 : పట్టణంలోని శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయంలో శ్రీ సంపత్ గణపతి పరివార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయకచవితి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు బి.బాబునాగేంద్ర, బి.ఎస్.నారాయణభట్టు, మేడూరి శ్రీరామచంద్రమూర్తి శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కామాక్షి దీపపూజ చేశారు.

రేపు సంగీత విభావరి

బాపట్ల, సెప్టెంబరు 13 : పట్టణంలోని వాగ్గేయకార వైభవం జిల్లా రచయితల సంఘం, శ్రీవాణి కళానికేతన్, బాపట్ల రోటరీక్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 15న సాయంత్రం రోటరీ కల్యాణ మండపంలో వాగ్గేయకార వైభవం అనే సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు తిమ్మనశ్యామ్‌సుందర్ శుక్రవారం తెలిపారు. ఆకాశవాణి, దూరదర్శన్ గాయనీమణులచే నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా అచ్యుతుని శంభు ప్రసాద్ రచించిన మనోన్మమి కావ్య ఆవిష్కరణ జరుగుతుందన్నారు.

పాముకాటుకు చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 13 : పిట్టలవానిపాలెం గ్రామపంచాయతీకి చెందిన పెరుమాళ్ళ శ్రీనివాసరెడ్డి (41) 20 రోజుల క్రితం పొలంలో పాము కాటుకు గురయ్యాడు. అనంతరం తెనాలి ప్రభుత్వ ఏరియావైద్యశాలలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన తర్వాత వినాయక చవితి నిమజ్జనానికి వెళ్ళి గ్రామంలోని బండ్లమ్మతల్లి దేవాలయంలో పడుకున్నాడు. ఉదయానికి శరీరం విషమయంగా మారటంతో చికిత్స నిమిత్తం గ్రామంలో ప్రాథమిక వైద్యం చేయించుకొని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం వెళ్ళినట్లు చందోలు ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్ తెలిపారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు తెలపగా తగు చర్య నిమిత్తం చందోలు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పవన్‌కల్యాణ్‌ను విమర్శించే అర్హత వైసీపీ నేతలకు లేదు

● జనసేన పార్టీ సమన్వయకర్త రాజేష్

వేమూరు, సెప్టెంబరు 13 : జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను విమర్శించే నైతిక అర్హత వైసీపీ నేతలకు ఏ మాత్రం లేదని వేమూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్ అన్నారు. ఆయన శుక్రవారం చావలి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ వరద ప్రాంతంలో పవన్ కల్యాణ్ పర్యటించలేదని అనవసరమైన ప్రచారం చేయడం వైసీపీ నాయకులకు ఏ మాత్రం తగదు అన్నారు. బాధిత ప్రాంతాల్లో పర్యటనకు వస్తే సహాయక చర్యలకు ఆటంకం కలుగుతుందని ఉన్నతాధికారులు సూచించడం మేర పవన్ కార్యాలయం నుండి బాధిత ప్రజలు ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అందాల్సిన సహకారాన్ని అనేక మార్గాల ద్వారా కొనసాగే విధంగా ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. కూటమి నేతలు వరద బాధితుల సహాయక చర్యల్లో తలమునకలై ఉంటే బెయిల్ కోసం వైసీపీ నాయకులు హైకోర్టు, సుప్రీం కోర్టు చుట్టూ ప్రదక్షిణలు చేయడం వింతగా ఉందన్నారు. పలువురు జనసేన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సీతారామ్ ఏచూరి మృతి బాధాకరం

రేపల్లె, సెప్టెంబరు 13 : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మృతికి భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ రేపల్లె ఏరియా సమితి తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది. రేపల్లె సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రేపల్లె సీపీఐ రాష్ట్ర సమితి నాయకుడు నాగాంజనేయులు మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమాలకు ఏచూరి మరణం తీరని లోటన్నారు. కార్యక్రమంలో రేపల్లె సీపీఐ ఏరియా కమిటీ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, శంకరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొల్లూరు, భట్టిప్రోలు, సెప్టెంబరు 13 : భారత కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాంకి సీపీఎం నాయకులు ఘన నివాళులర్పించారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ ఏచూరి మరణం భారతదేశంలోని ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అమృతలూరి కృపానందం, బొనిగల సుబ్బారావు, తోడేటి సురేష్, గాబ్రియేలు, ఎం.సత్యనారాయణ, దీపాల సత్యనారాయణ, రామస్వామి, సుబ్బారావు, టి.శ్రీను, పి.పరిశుద్ధరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

రేపల్లె, సెప్టెంబరు 13 : విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ నుంచి నిజాంపట్నం రోడ్డు మొత్తం, జేఎల్బీ కాలేజీ రోడ్డు, గరువురోడ్డులలో విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందన్నారు.

● వేమూరు, సెప్టెంబరు 13 :మండల పరిధిలోని వేమూరు, పెరవలి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాల్లో శనివారం మరమ్మతుల నిమిత్తంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ గోపి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రెండు సబ్ స్టేషన్లలోని 17 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

మురళీమోహన్‌కు 'గురుబ్రహ్మ' అవార్డు



మురళీమోహన్

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 13 : వరద ప్రభావిత గ్రామాల్లో చేసిన సేవలకు ఓ స్వచ్ఛంద సంస్థ గురుబ్రహ్మ అవార్డుతో ఉపాధ్యాయుడిని సత్కరించనుంది. మండల పరిధిలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గుర్రం మురళీమోహన్ ఈ అవార్డును అందుకోనున్నారు.

చేనేత కార్మికులకు బీమాను ప్రకటించిన కూటమి ప్రభుత్వం

రేపల్లె, సెప్టెంబరు 13 : ప్రతి చేనేత కుటుంబానికి ఆరోగ్య బీమా పథకం క్రింద ప్రభుత్వం రూ.2,100 చెల్లించి ఆదుకుంటుందని చేనేత ఏపీ రాష్ట్ర వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జీవీ నాగేశ్వరరావు అన్నారు. ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి కుటుంబంలోని భార్య, భర్త, ఇరువురు పిల్లలకు రూ.10 వేల రూపాయలు ఓపీ వైద్యం చేయించుకునేందుకు అందిస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, చేనేత మంత్రి సవితా, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లు చేనేత కుటుంబాలపై చూపిన చొరవను ఎన్నటికి రాష్ట్రంలోని చేనేత కుటుంబాలు మరువబోవని ఆయన చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు

కొల్లూరు, సెప్టెంబరు 13 : అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శుక్రవారం నిర్వహించారు. మండల కేంద్రం కొల్లూరు, పెసర్లంక అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పోషకాహార మాసోత్సవాల ర్యాలీ నిర్వహించారు. అనంతరం సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నగరాజకుమారి మాట్లాడుతూ, గర్భవతులు, బాలింతలు, కిషోరి బాలికలు పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో పెసర్లంక సర్పంచ్ వి.నాగమణి, ఏఎన్ఎం సుజాత, కార్యకర్తలు సత్యవతి, కాశీవిశాలాక్షి పాల్గొన్నారు.

పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలి

బాపట్ల, సెప్టెంబరు 13 : గర్భిణులు, బాలింతలతోపాటు కిషోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ, తెలుగుదేశం పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ తెలిపారు. అప్పికట్ల సెక్టార్ పరిధిలోని ఈతేరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పిచ్చమ్మ, అరుణ, ఉషా తదితరులు పాల్గొన్నారు.



శివప్రసాద్‌కు రూ.లక్ష విరాళాన్ని అందజేస్తున్న కౌండిన్య సేవాసమితి సభ్యులు

వరద బాధితులకు రూ.లక్ష చెక్కు అందజేత

రేపల్లె, సెప్టెంబరు 13 : వరద బాధితులకు చేయూతనివ్వాలనే ఉద్దేశ్యంతో రేపల్లెకు చెందిన కౌండిన్య సేవాసమితి ఆధ్వర్యంలో రూ.లక్ష విరాళాన్ని అందివ్వటం జరిగిందని కౌండిన్య సేవాసమితి సభ్యులు గుర్రం మురహరిరావు అన్నారు. మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్‌కు రూ.లక్ష విరాళం చెక్కును శుక్రవారం వరద బాధితులకు అండగా నిలిచేందుకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పడమటి వెంకటసుబ్బారావు, కేసన రవీంద్ర, ప్రసాద్, యరగాళ్ళ మారయ్య, సాంబయ్య, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వరదల్లో ప్రజల కష్టాలు వర్ణనాతీతం : కేసన

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 13 : వరదల సమయంలో ప్రజలు అనుభవించిన కష్టాలు వర్ణనాతీతమని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. బీసీ సంక్షేమ సంఘం అనుబంధ సంస్థ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన బీసీ చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు, చింతమోటు గ్రామంలోని 500 మంది వరద బాధిత కుటుంబాలకు దుస్తుల కిట్స్‌ను శంకరరావు ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన సహాయ సహకారాలు అభినందనీయమని, అలాగే వాణిజ్య పంటలు నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు అధిక సాయం అందించి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. స్థానిక శాసన సభ్యులు నక్కా ఆనందబాబు సూచనల మేరకు శొంఠి పూర్ణచంద్రరావు సహాయ సహకారాలతో బాధితులకు తోడ్పాటు అందించడం సంతోషదాయకమని రామాంజనేయులు అన్నారు. త్వరలో బీసీ సంఘ సమాఖ్య సభ్యుల సహకారంతో ముఖ్యమంత్రికి రిలీఫ్ ఫండ్‌ను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేల్పుల భాస్కర్, సుంకర వేణు, కొత్తపల్లి శ్రీనివాసరావు, సంక్షేమ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడు క్రాంతికుమార్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు మహేష్, రాజ్‌కిరణ్, సుబ్బారావు, వెంకయ్య, రామకృష్ణ, రాయన ప్రసాదరావు పాల్గొన్నారు.



బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు శంకరరావు

ముంపు బాధితులకు బాపట్ల చర్చి యూనియన్ చేయూత

బాపట్ల, సెప్టెంబరు 13 : విజయవాడలోని వరద బాధితులకు బాపట్ల పట్టణ డినామినేషన్ చర్చి యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. బాధితులకు బియ్యం, కందిపప్పు, ఆయిల్ ప్యాకెట్‌లతో కూడిన కిట్‌లను పంచిపెట్టారు. ఆపదలో ఉన్నవారికి తమ వంతు సాయంగా వీటిని అందజేస్తున్నట్లు అధ్యక్షులు కృపాకరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ బెంజిమెన్, పాస్టర్ సుధాకర్, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సాయం

కొల్లూరు, సెప్టెంబరు 13 : వరద బాధితులకు ఉపాధ్యాయులు తమ వంతుగా నిత్యావసర సరుకులు అందజేశారు. అమృతలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు వరద బాధితులను ఆదుకునేందుకు రూ.50 వేలు విరాళం అందించారు. వాటితో మండల పరిధిలోని కిష్కిందపాలెంలోని వరద వల్ల నిరాశ్రయులైన 470 మందికి వంట నూనె, గోధుమ పిండి పంపిణీ చేశారు. ఎస్సీ కాలనీలో 370 మందికి, గ్రామంలో 100 మందికి వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నిరీక్షణరావు, ఉపాధ్యాయులు మాజేటి వెంకటేశ్వరరావు, ఆదినారాయణ, గిరిధర్, దాసరి శ్రీనివాసరావు, రవి, ఆనంద్, మధు, విజయలక్ష్మి, రత్నకుమారి పాల్గొన్నారు.

చీరాల సేవా సంఘాల సమాఖ్య ప్రతినిధుల దుస్తుల పంపిణీ

కొల్లూరు, సెప్టెంబరు 13 : చీరాల సేవా సంఘాల సమాఖ్య ప్రతినిధులు 350 కుటుంబాలకు నిత్యవసరాలు, దుస్తులు పంపిణీ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని తోకలవానిపాలెం, తురకపాలెం గ్రామాల్లో వరద బాధితులకు చీరాల సేవా సంఘం కన్వీనర్ ఎం.రాఘవేంద్రరావు రూ.5 లక్షల విలువైన నిత్యవసరాలు, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆదేశాల మేరకు వరద ప్రభావిత గ్రామాల్లోని బాధితులను ఆదుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టి.కృష్ణమోహన్, సమాఖ్య సభ్యులు మురళీకృష్ణ, మధుసూదనరావు పాల్గొన్నారు.

రూ.17లక్షల ఎల్‌వోసీ చెక్కు అందజేత


రేపల్లె, సెప్టెంబరు 13 : మండలంలోని చాట్రగడ్డ గ్రామానికి చెందిన వుయ్యూరు వెంకట నాగేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతుండగా రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో వైద్యఖర్చుల కొరకు సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీకి సంబంధించి రూ.17 లక్షల చెక్కును నాగేశ్వరరావుకు మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అందించారు. వైద్యం చేయించుకోలేని పరిస్థితిలో మంత్రి అనగాని సత్యప్రసాద్ పెద్ద మనసుతో రూ.17 లక్షల చెక్కును మంజూరు చేయించటం ఆ కుటుంబం జీవితాంతం వారికి రుణపడి ఉంటుందని నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో చాట్రగడ్డ సర్పంచ్ వుయ్యూరు గంగాధరరావు, వాకా శ్రీనివాసరావు, వాసు, రామస్వామి, మోర్ల అంజయ్య, పాల్గొన్నారు.

రేపు మెగా ఉచిత వైద్య శిబిరం

చెరుకుపల్లి, సెప్టెంబరు 13 : ఆస్టర్ రమేష్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఈనెల 15న ఉచిత మెగా వైద్యశిబిరం జరుగుతుందని రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ చెప్పారు. ఆయన శుక్రవారం చెరుకుపల్లిలోని ఆస్టర్ రమేష్ హాస్పటల్‌లో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు గుండెజబ్బుల వైద్యపరీక్షలను ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామాల్లోన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. వైద్య శిబిరం ఉదయం 8 గంటలకు ప్రారంభమౌతుందన్నారు. గుండె, ఊపిరితిత్తులు, మెదడు, నరముల వైద్యనిపుణులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో రమేష్ హాస్పటల్ బిజినెస్ హెడ్ యలవర్తి కార్తీక్‌చౌదరి, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, టీడీపీ నాయకులు మొఖమాటం రాధాకృష్ణమూర్తి, ఉప్పాల సాంబశివరావు, మండవ తాతాజీ, దివి రాంబాబు, గోగినేని వసుధ, కందుల వెంకటేశ్వరరావు, పలువురు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సెండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలి

● బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరిని కోరిన ఆపస్ ప్రతినిధులు



పురందేశ్వరితో ఉపాధ్యాయ సమస్యలపై చర్చిస్తున్న ఆపస్ సంఘ ప్రతినిధులు

వేమూరు, సెప్టెంబరు 13 : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సెండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు కూడా ఓటు హక్కు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరిని కోరారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాయలంలో శుక్రవారం ఆపస్ ప్రతినిధులు పురందేశ్వరిని కలిసి పలు ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. పిఎంశ్రీ పాఠశాలలకు విడుదల కావలసిన నిధులను కేంద్ర ప్రభుత్వం ద్వారా వెంటనే విడుదల చేయించాలని కోరారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విషయంపై కూడా కొన్ని సూచనలు ఇచ్చారు. పురందేశ్వరి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కార దిశలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిపూర్ణ ప్రసాద్, రాష్ట్ర సంఘటన కార్యదర్శి శ్రావణ్‌కుమార్, బాపట్ల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌కుమార్, కాకినాడ ఆపస్ జిల్లా బాధ్యులు హాజరయ్యారు.

బాలినేనిని కూటమి పార్టీలు చేర్చుకోవద్దు

అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే మార్పు ప్రయత్నాలు

భూ అక్రమాలపై సిట్‌ను వెంటనే పునరుద్ధరించాలి

జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్) సెప్టెంబరు 13 : గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ కాలంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన అవినీతి, అక్రమాలు బయటపడకుండా ఉండటానికే కూటమి పార్టీల్లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని జనచైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. బాలినేని అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. ఈ విషయంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిలు ఆలోచించాలని కోరారు. బాలినేని గతంలో చేసిన అవినీతి, అక్రమాలను దృష్టిలో పెట్టుకొని వారి వారి పార్టీల్లో చేర్చుకోవద్దని కోరారు. సిట్‌ను పునరుద్ధరించి దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వెలిగొండ ప్రాజెక్టు నేటికి పూర్తి కాలేదని, గుండ్లకమ్మలో గేట్లు కొట్టుకుపోతే వాటిని సైతం పునరుద్ధరించలేదని ఎద్దేవా చేశారు. ఎలాంటి వ్యాపారాలు, పరిశ్రమలు లేకుండా వందలాది కోట్లు రాజకీయాల్లో ఏలా సంపాదించారో బాలినేని బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

18న జిల్లా పరిషత్ స్థాయీసంఘ సమావేశాలు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 13 : జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 18వ తేదీన జిల్లా పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని జడ్పీ ఇన్‌చార్జి సీఈవో కె.మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అంశాల వారీగా చర్చిస్తారన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి దుస్తులు, నిత్యావసర వస్తువులు అందజేస్తున్న టీడీపీ నాయకులు

చినగంజాం, సెప్టెంబరు 13 : పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి టీడీపీ నాయకులు సాయం అందించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని జాలమ్మ కాలనీకి చెందిన మానికల సుబ్రమణ్యం కుటుంబానికి శుక్రవారం రాత్రి మండల అధ్యక్షులు పొద వీరయ్య ఆధ్వర్యంలో సాయం అందించారు. సుబ్రమణ్యం భార్య లక్ష్మీ గుంటూరు జీజీహెచ్‌లో ఆడ శిశువుకు జన్మనిచ్చి మృతి చెందింది. ఆమె దశదిన కర్మ శనివారం కావడంతో దానికి కావలసిన నిత్యావసర వస్తువులు, బియ్యం, కూరగాయలు, వారి 8మంది సంతానానికి దుస్తులను టీడీపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీ.జయరావు, చెరుకూరి రాఘవయ్య, సయ్యద్ అబ్దుల్‌కలాంఅజాద్, సందు శ్రీనివాసరావు, మోటుమర్రి రామసుబ్బారావు, షేక్.జిలాని, బెల్లంకొండ రమేష్‌బాబు, పర్వతరెడ్డి పార్థసారిధి, నరహరి శ్రీనివాసరావు, భయ్యా సతీష్, పల్లపోలు లక్ష్మీనారాయణ, ఎం.పద్మావతి, షేక్.నబీషా, గుండ్రెడ్డి నరసింహారావు, ఎం.లక్ష్మయ్య, షేక్.బాజీ, జి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

18న రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికలు

పర్చూరు, సెప్టెంబరు 13: రాష్ట్ర, జాతీయస్థాయిలో జరిగే పోటీలకు సంబంధించి స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కందుకూరు, ఏబీఎం జూనియర్ కళాశాల ఒంగోలులో ఈనెల 18వ తేదీన ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా పాఠశాలల ఆటల పోటీల కార్యదర్శి చింపారెడ్డి తెలిపారు. బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, సెపక్ తక్రా పోటీల్లో ఎంపిక జరుగుతుందన్నారు. అండర్ 14 విద్యార్థులు 2011 జనవరి 1వ తేదీలోపు, అండర్ 17 విద్యార్థులు 2008 జనవరి 1వ తేదీలోపు, అండర్ 19 విద్యార్థులు 2006 జనవరి 1లోపు జన్మించి ఉండాలన్నారు. ఆసక్తి కల్గిన క్రీడాకారులు ఆయా ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపాళ్ల నుంచి పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌తోపాటు, పదవ తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్‌తో హాజరుకావాలన్నారు. వివరాలకు 9848125706, 9440621579 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కొనసాగుతున్న ఈనాం భూముల సర్వే



సర్వే చేస్తున్న ప్రత్యేక టీంలు

బల్లికురవ. సెప్టెంబరు 13 : జిల్లా జాయింట్ కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మండలంలోని చెన్నుపల్లి గ్రామ పరిధిలో ఉన్న ఈనాం భూముల సర్వే రెండో రోజు అయిన శుక్రవారం కూడా జరిగింది. మొత్తం అయిదు టీంలు గ్రామంలోని సర్వే నెంబర్ల ఆధారంగా భూములకు కొలతలు వేస్తున్నారు. భూములు ఎవరు సాగు చేస్తున్నారు అన్న వివరాలను నమోదు చేస్తున్నారు. అలానే ఎవరు సాగు చేయకుండా ఎంత భూమి నిరుపయోగంగా ఉంది అన్న వివరాలను సేకరిస్తున్నారు. రైతులకు హక్కులు కల్పించేందుకు ఈ సర్వే జరుగుతుందని ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. కొందరి రైతుల భూములకు హద్దులు కూడా సరిగా లేవని, ఈ సర్వే వలన రైతులకు ఎంతో ఉపయోగం అని ఆయన తెలిపారు. అన్ని సర్వే నెంబర్లలో కొలతలు వేసి నివేదికలు తయారు చేస్తామని ఆయన తెలిపారు.

పేద మహిళకు కుట్టుమిషన్ అందజేత

అద్దంకి, సెప్టెంబరు13: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పేద మహిళకు కుట్టుమిషన్ అందజేశారు. మండలంలోని ధేనువకొండకు చెందిన పేద మహిళ షేక్ మీరాబీకి రాచమల్లు జగదీశ్వర్, జస్వంత్‌ల పుట్టిన రోజు సందర్భంగా రాచమల్లు కుటుంబసభ్యులు శుక్రవారం కుట్టుమిషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహ్మద్‌రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ దేవపాలన, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, జ్యోతి చంద్రమౌళి పాల్గొన్నారు.

కౌన్సిల్ సక్సెస్!



సమావేశంలో ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు జనార్దన్, విజయ్‌కుమార్, కార్పొరేటర్లు

తొలిసారి టీడీపీ బలంతో కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం

అజెండాలోని పలు అభివృద్ధి అంశాలకు ఆమోదం

కోరం లేకుండా చేసేందుకు వైసీపీ నేతల ప్రయత్నం

హైదరాబాద్‌కు తరలిన 20మంది కార్పొరేటర్లు

వారి ఎత్తుగడ విఫలం.. 27మందితో సజావుగా మీటింగ్

ఎక్స్‌అఫిషియో మెంబర్లుగా ప్రమాణం చేసిన ఎమ్మెల్యేలు, ఎంపీ

అందరి సహకారంతో ఆగ్రస్థానంలో ఒంగోలు అభివృద్ధి

ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు జనార్దన్, విజయకుమార్

వైసీపీ సభ్యుల బలంతో గడిచిన మూడేళ్లుగా కొనసాగిన ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం తొలిసారిగా టీడీపీ బలంతో విజయవంతమైంది. గతంలో టీడీపీ సభ్యులు ఆరుగురు ఉండగా, జనసేన నుంచి ఒకరు గెలుపొందారు. ఇదిలా ఉండగా ఇటీవల ఎన్నికల సమయంలో ఐదుగురు, తాజాగా పదిహేను మంది వైసీపీ కార్పొరేటర్లు అధికార పార్టీలో చేరారు. దీంతో కార్పొరేషన్ పీఠం టీడీపీ కైవసం చేసుకుంది. ఎంపీ, ఎమ్మెల్యేలు ఎక్స్‌అఫిషియో మెంబర్లుగా ప్రమాణం చేశారు. దీంతో మొత్తం 27మంది టీడీపీ కార్పొరేటర్లు, ముగ్గురు ఎక్స్ అఫిషియో సభ్యులతో 30కి చేరిన బలంతో జరిగిన తొలి సమావేశంలో పది అంశాలు అజెండాలో పొందుపరచగా, ఒకటి మినహా అన్నింటిని ఆమోదించారు.

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 13 : టీడీపీ బలంతో మొదటిసారి జరుగుతున్న కౌన్సిల్ సమావేశం విజయవంతమైంది. ఏదో ఒక విధంగా సమావేశం జరగకుండా చూడాలనే తలంపుతో వైసీపీ కార్పొరేటర్లు గైర్హాజరయ్యారు. సభ్యుల కోరం లేకుండా చేసేందుకు వేసిన ఎత్తుగడలు విఫలం అయ్యాయి. శుక్రవారం సమావేశం జరుగుతుందని తెలియడంతో గురువారం రాత్రి వైసీపీ కార్పొరేటర్లందరు హైదరాబాద్‌లోని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి నివాసానికి చేరుకున్నారు. దీంతో సమావేశం జరగదని భావించిన వైసీపీ మూడింట రెండు వంతుల సభ్యులు అనగా, 36 మంది ఉంటేనే కౌన్సిల్ జరుగుతుందని అనుకున్నారు. అయితే నిబంధనల ప్రకారం మూడవ వంతు సభ్యులు యాభై మందిలో 18మంది ఉంటే సరిపోతుందని కమిషనరు వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా మునిసిపల్ చట్టంలోని అంశాలను వివరించడంతో సమావేశం ఎలాంటి అడ్డంకులు లేకుండా కొనసాగింది. అయితే ఉదయం నుంచి సమావేశం నిర్వహించేందుకు కోరం లేదంటూ కొందరు చేసిన ప్రచారం చర్చనీయాంశం కాగా, వైసీపీ కార్పొరేటర్లు హాజరుకాకపోయినా సమావేశం సజావుగా జరగడంతో వైసీపీ వర్గీయులు డీలాపడ్డారు. ఇదిలా ఉంచితే 8వ అంశమైన వైసీపీ ప్రభుత్వంలో నవరత్నాలలో భాగంగా జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ కోసం హద్దురాళ్లు, రోడ్లు నిర్మాణం తదితర పనులకు సంబంధించి రూ.21.335 కోట్లు బిల్లుల మంజూరుపై సమావేశంలో చర్చకు వచ్చింది. ఈ అంశంపై మరింత లోతుగా చర్చించాల్సి ఉందని సభ్యులు తెలిపారు. దీంతో ఆ అంశాన్ని వాయిదా వేశారు.

ఒంగోలు అభివృద్ధికి నిధులు కోరతాం



మాట్లాడుతున్న మేయర్ సుజాత

కార్పొరేటరు, కార్పొరేషన్ అధికారుల సహకారం, కృషితో ఒంగోలు నగరాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలబెట్టడమే లక్ష్యమని, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఒంగోలు కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పాటు అయిన తర్వాత, టీడీపీ బలంతో జరిగిన కౌన్సిల్ సమావేశం మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్‌లు కోఆప్షన్ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తొలిసారిగా ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, బీఎన్ విజయ్‌కుమార్ కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం అవసరమై నిధులు ప్రభుత్వం నుంచి కోరుతామన్నారు. అలాగే సభ్యులందరు కలిసి అభివృద్ధి వైపు నడిచి, రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెట్టాలని కోరారు. తాను 2014 నుంచి ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ కౌన్సిల్ లేకపోవడంతో హాజరు కాలేకపోయాయని, అయితే కౌన్సిల్ ఏర్పడిన తర్వాత తొలిసారి సమావేశానికి రావడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీ మాగుంట మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా ఒంగోలు ఎంపీగా ఉన్నానని, నగర అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషించానని, భవిష్యత్‌లో కూడా సహకరిస్తానని తెలిపారు. బీఎన్ విజయ్‌కుమార్ ఒంగోలు నగరంతో ఎస్ఎన్‌పాడు నియోజకవర్గం ముడిపడి ఉందన్నారు. అది చాలా సంతోషమన్నారు. తన వంతుగా నగర అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించడంతోపాటు, అభివృద్ధిలో భాగస్వాముడిని అవుతానని తెలిపారు. అనంతరం కౌన్సిల్ సభ్యులు అందరు తమ డివిజన్లు, డివిజన్లలోని సమస్యలను వివరిస్తూ ఎక్స్ అఫిషియో సభ్యులకు పరిచయం చేసుకున్నారు. అలాగే నగర కమిషనరుగా బాధ్యతలు స్వీకరించిన కోడూరి వెంకటేశ్వరరావు కూడా పాలకవర్గానికి పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంతః జానీ బాషా పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి

నగరంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని కార్పొరేటర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. గత వైసీపీ హయాంలో పారిశుధ్య కార్మికులుగా చేరిన కొందరు ఆ పార్టీ కార్యకర్తలు పనిచేయకుండా మేస్త్రీలుగా కొనసాగుతున్నారని, మరికొందరు ఎక్కడ పనిచేస్తున్నారో తెలియదని తెలిపారు. తద్వారా పూర్తిస్థాయిలో కార్మికుల కొరత ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో విధుల్లో చేరి, పనిచేయకుండా తిరుగుతున్న వారిని తొలగించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్యం మెరుగు కోసం కొత్త వారిని నియమించి, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కార్పొరేటర్లు దాచర్ల వెంకట రమణయ్య, మలగా రమేష్, అంబూరి శ్రీనివాసరావు, పసుపులేటి విజయలక్ష్మి, వేమూరి భవానీ, గుట్లపల్లి మస్తానమ్మతోపాటు మొత్తం 27 మంది కార్పొరేటర్లు హాజరయ్యారు.

నామినేషన్ పనుల అవినీతిపై విచారణ చేయాలి



ఆంధ్రజ్యోతి కథనాన్ని చూపిస్తున్న డిప్యూటీ మేయర్ బుజ్జి

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.95లక్షలతో నామినేషన్ పద్ధతిన చేపట్టిన పందొమ్మిది పనుల్లో అవినీతిపై ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురించిన కథనంపై డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి ప్రశ్నించారు. 'పనులు పంచుకుతిన్నారు' కథనంలో పేర్కొన్న అంశాలు అనుమానాలకు తావిస్తున్నాయన్నారు. అత్యవసరం పేరుతో పనులు ఎలా చేపడతారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా దీనిపై ప్రత్యేక కమిటీతోపాటు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో విచారణ చేసి, అవినీతిని నిగ్గు తేల్చాలని బుజ్జి డిమాండ్ చేశారు.

ఇంకా అదే దౌర్జన్యం!

టీడీపీకి ఓటేశారని రోడ్డు మూసేశారు

ప్రభుత్వ లేఅవుట్‌లో వైసీపీ నాయకుల చిచ్చు

వారికే వత్తాసు పలుకుతున్న రెవెన్యూ అధికారులు

ప్రైవేటు వ్యక్తి స్థలం అంటూ స్పష్టం

దారి మూతతో ఇబ్బందిపడుతున్న కాలనీవాసులు

ఏ పార్టీ అధికారంలో ఉందో అర్థం కావడం లేదని

వాపోతున్న బాధితులు



బీసీ కాలనీలో కర్రలతో మూసేసిన రస్తా

మార్కాపురం, సెప్టెంబరు 13: ప్రతి పేదవానికి కూడు, గూడు, గుడ్డ కల్పించాలనే నినాదంతో 1983లో ప్రజల ఆదరణతో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు ఆశయం మేరకు మండలకేంద్రమైన తర్లుపాడులో సుమారు 6 ఎకరాల్లో 100 బీసీ కుటుంబాలకు లేఅవుట్ ఏర్పాటు చేసి ఇళ్లు నిర్మించి ఇచ్చారు. అప్పట్లో ప్రైవేటు వ్యక్తుల వద్ద భూమిని కొనుగోలు చేసి మరీ బీసీ కాలనీ నిర్మించారు. సుమారు 40 సంవత్సరాలుగా అక్కడ నివాసముంటున్న వారిలో కొందరికి ఇప్పుడు కొత్త చిక్కు వచ్చిపడింది. సార్వత్రిక ఎన్నికల్లో కొందరు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆయా కుటుంబాలపై కక్ష పెంచుకున్న వైసీపీ నాయకులు ఎలాగైనా వారికి ఇబ్బందులు సృష్టించాలని పన్నాంగం పన్నారు. కాలనీ అనుకుని స్థలం ఉన్న ఓ వైసీపీ వర్గీయుడిని రెచ్చగొట్టి రహదారిని కర్రలు కట్టి మూసేయించారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ రెవెన్యూ అధికారుల వద్దకు పరిగెత్తారు. వైసీపీ ప్రభుత్వంలో పోస్టింగులు పొందిన రెవెన్యూ సిబ్బంది కొలతలు వేసి ప్రైవేటు వ్యక్తి స్థలంలో కొంతమేర ఇళ్లు ఉన్నట్లు నిర్ధారించారు. నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన రహదారిని ఇప్పుడెలా మూసేస్తారని ప్రశ్నిస్తే రెవెన్యూ అధికారుల వద్ద జవాబు లేదు.

ఓట్లు వేశారని కక్షసాధింపు చర్యలు

తర్లుపాడు మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 388/2ఎలో 6 ఎకరాలు, 388/2బీలో 71 సెంట్ల భూమిలో 1983లో బీసీ సామాజికవర్గానికి చెందిన 100 కుటుంబాల వాళ్లకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇచ్చింది. కాలక్రమంలో కొందరు ఇళ్లు ఇతరులకు అమ్ముకున్నారు. ఎక్కువమంది గత 40 ఏళ్లుగా కాలనీలోనే నివస్తున్నారు. మొదట్లో టీడీపీకి కంచుకోటగా ఉన్న బీసీ కాలనీ కాలక్రమంలో కాంగ్రెస్ పార్టీకి, ప్రస్తుతం వైసీపీ పార్టీకి అనుకూలంగా మారింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీలోకి కొందరు చేరారు. దీంతో కక్ష పెంచుకున్న మండల కేంద్రానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరిన వారిని ఎలాగైనా ఇబ్బందులు పెట్టాలని యోచించారు. కాలనీకి అనుకుని 388/3బి సర్వే నెంబర్‌లో 44 సెంట్ల స్థలం ఉన్న వైసీపీ కార్యకర్త గోగు యల్లయ్యను పావుగా వాడుకున్నారు. వాస్తవానికి ఆ స్థలం యల్లయ్య మామ వన్నెబోయిన గురవయ్య పసుపుకుంకుమ కింద కుమార్తె గాలెమ్మకు ఇచ్చారు. 44 సెంట్ల స్థలంలో 20 సెంట్లు అమ్ముకోగా మిగిలిన స్థలం బీసీ కాలనీ లేఅవుట్‌లో కలిసిపోయింది. ఈ విషయమై గోగు గాలెమ్మ పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు ఆ స్థలం లేఅవుట్‌లో కలసిపోయిందని కూడా స్పష్టం తెలియజేశారు. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో మళ్లీ ఈ స్థలం వివాదాన్ని బయటకు తీసి నాయకులు వారికి అనుకూలంగా మలుచుకుంటున్నారు. ప్రస్తుతం కాలనీలోని కొందరు టీడీపీకి మద్దతు తెలిపి ఓట్లు వేయడంతో మళ్లీ వివాదానికి నాయకులు ఆజ్యం పోశారు. 388/3బి సర్వే నెంబర్‌లోని స్థలానికి చెందిన వారిని రెచ్చగొట్టి రహదారికి అడ్డంగా కర్రలతో కంచె ఏర్పాటు చేసి మూసివేశారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వ నిధులతో సీసీ రహదారులు, మురుగు కాలువలు నిర్మించినా వైసీపీ నాయకులు అడ్డగోలుగా ఒకే సామాజికవర్గానికి చెందిన వాళ్ల మధ్య చిచ్చుపెట్టి చోద్యం చూస్తున్నారు.

కొమ్ముకాస్తున్న రెవెన్యూ అధికారులు

బీసీ కాలనీకి అనుకుని ఉన్న సర్వేనెంబర్‌లో జరుగుతున్న వివాదం మొత్తం రెవెన్యూ అధికారులకు తెలుసు. ముఖ్యంగా గతంలో పనిచేసిన తహసీల్దార్ చంద్రలీల 2017లో స్పష్టంగా 388/3బీ సర్వే నంబర్‌లోని 44 సెంట్లలో 20 సెంట్ల మేర 1983లో 388/2ఎ సర్వే నెంబర్‌లో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో కలిసిపోయినట్లు ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. అప్పట్లో వచ్చిన ఫిర్యాదులకు అనుగుణంగా విచారించి అర్జీదారులకు విషయాన్ని తెలియజేశారు. కానీ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడకు వచ్చిన రెవెన్యూ సిబ్బంది, అధికారులు పాత సమస్యను మళ్లీ తెరపైకి తెచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినా ఇంకా బదిలీ కాకుండా ఇక్కడే ఉన్న గ్రామస్థాయి రెవెన్యూ సిబ్బంది వలనే వివాదం మళ్లీ రాజుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పరిష్కారానికి నోచుకోని భూవివాదాలు

గత వైసీపీ ప్రభుత్వంలో అధికారుల

తీరుతో జటిలమైన సమస్యలు

రికార్డులు తారుమారు చేసినట్లు ఆరోపణలు



దర్శిలో వివాదంలో ఉన్నభూమి

దర్శి, సెప్టెంబరు 13 : దర్శి ప్రాంతంలో ఏళ్ల తరబడి భూములు, స్థలాల వివాదాలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. దీంతో నిజమైన హక్కుదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది వ్యవహరించిన అనుచిత వైఖరి భూ యజమానులకు ఇబ్బందికరంగా మారింది. అప్పటి అధికారులు చేసిన పాపాలు బాధితుల పాలిట శాపాలుగా మారాయి. అధికారులు ముడుపులు తీసుకొని రికార్డులు కూడా ట్యాంపరింగ్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎంతో విలువైన స్థలాలు, భూముల వివాదాలు పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ సంవత్సరాల తరబడి తిరిగినా పరిష్కారం కాక కొంతమంది కోర్టులను కూడా ఆశ్రయించారు.

దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డులో రూ.2కోట్ల విలువైన పది సెంట్ల స్థలంకు సంబంధించిన వివాదం ఏళ్లతరబడి కొనసాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ వివాదం మరింత జటిలమైంది. కొంతమంది వైసీపీ నాయకులు ఆ వివాదంలో చొరబడి సమస్యను తీవ్రం చేశారు. ఒక వ్యక్తి 15సంవత్సరాల క్రితం ఆ స్థల హక్కుదారుల నుంచి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించున్నారు. అయితే అదే స్థలాన్ని పూర్వీకుల ద్వారా హక్కు ఉందని మూడేళ్ల క్రితం మరొకరు రిజిస్టర్ చేయించుకున్నారు. రెండోసారి చేయించుకున్న వారు పంచాయితీలో భాగంగా వైసీపీ నాయకులు ఉండటం గమనార్హం. ఈ వివాదంపై గత ప్రభుత్వ హయాంలో అప్పటి కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్‌ను విచారణ అధికారిగా వేశారు. ఆయన స్థలాన్ని పరిశీలించి వెళ్లి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు పరిష్కారానికి నోచుకోలేదు.

అలాగే, దర్శి -కురిచేడు రోడ్డులో మరో స్థలం హద్దుల విషయంలో ఏళ్ల తరబడి వివాదం కొనసాగుతోంది. ఆ స్థలం తొలుత పూర్వీకుల సమయంలో సమాన భాగాలైంది. ఆతర్వాత కొనుగోలు చేసినవారిలో ఒక వ్యక్తి దర్శి-కురిచేడు ప్రధాన రహదారి వైపు ఎక్కువ స్థలాన్ని ఆక్రమించుకున్నాడు. తనకు చేసిన రిజిస్ట్రేషన్‌లో కొలతల ప్రకారం స్థలానికి హద్దులు ఏర్పాటు చేసుకున్నట్లు చెబుతున్నాడు. ఆ స్థలం పక్కన అందులో భాగమైన స్థలాన్ని కొనుగోలు చేసిన వారికి ప్రధాన రహదారి వైపు వెడల్పు తగ్గిపోయింది. దీంతో స్థలం విలువ తగ్గిపోవడంతో వివాదం ఏర్పడింది. ఈక్రమంలో వైసీపీలో కొందరు పెద్దలు ఆ స్థలం వివాదాన్ని పరిష్కరిస్తామని రంగంలోకి దిగారు. ఒక పార్టీకి చెందిన స్థలాన్ని వారే కొనుగోలు చేసి అగ్రిమెంట్ కూడా రాసుకున్నారు. ఈ వివాదం కూడా నేటివరకు పరిష్కారం కాలేదు.

మండలంలోని రాజంపల్లిలో ఒక స్థలం వివాదం ఏళ్లతరబడి కొనసాగుతోంది. ఇక్కడ ఇరువర్గాలు తమకు హక్కు ఉందటే తమకు హక్కు ఉందని పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఆ స్థలం విషయంలో ఒక వీఆర్వోపై కేసు కూడా నమోదైంది. అలాగే, బొట్లపాలెంలో ఒక స్థలం వివాద పరిష్కారం కోసం ఏళ్ల తరబడి బాధితుడు తిరుగుతున్నాడు. ఇప్పటివరకు ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదు.

కూటమి ప్రభుత్వం రాకతో ఆశలు

కూటమి ప్రభుత్వం రాకతో భూములు, స్థలాల సమస్యలు పరిష్కారం అవుతాయని సంబంధిత వ్యక్తులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన అధికారులు బదిలీలపై వెళ్లారు. కొత్తగా వచ్చిన అధికారులు తమకు న్యాయం చేస్తారనే నమ్మకంతో మళ్లీ తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది న్యాయంకోసం కోర్టును ఆశ్రయించారు.తీవ్రంగా మారిన భూములు, స్థలాల వివాదాలను తాజాగా వచ్చిన అధికారులు పరిష్కరించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

జనసేనలోకి రవిశంకర్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో కూటమి భాగస్వామి పార్టీలోకి వెళ్లేవారి సంఖ్య పెరిగిపోతుంది. వైసీపీ నాయకులతోపాటు వివిధ వర్గాల వ్యాపార ప్రముఖులు కూటమి భాగస్వామి పార్టీలోకి చేరుతున్నారు. తాజాగా ఒంగోలుకు చెందిన పారిశ్రామికవేత్త కంది రవిశంకర్ జనసేన పార్టీలోకి చేరేందుకు రంగం సిద్ధమైంది. ఈనెల 16 లేదా 18వతేదీన ఆయన పవన్‌కళ్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరనున్నారు. తన వియ్యంకుడు పొన్నూరు మాజీ ఎమ్మెల్యే రోశయ్యతో కలిసి ఆయన జనసేనలో చేరనున్నారు. టీవీఎస్ ఏజన్సీతోపాటు నగరంలో రవిప్రియ మాల్‌కు ఆయన యజమాని. తిరుపతి జనసేన ఎమ్మెల్యే శ్రీనివాసులు కూడా రవిశంకర్ సమీప బంధువు. కాగా గతంలో వైసీపీలో ఉంటూ మాజీ మంత్రి బాలినేని అనుచరుడిగా కొనసాగారు.


సుబ్రమణ్యం కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

సుబ్రమణ్యం కుటుంబాన్ని కలిసిన అధికారులు

చినగంజాం, సెప్టెంబరు 13 : తల్లి మృతి చెంది 8 మంది పిల్లలతో ఇబ్బందులు పడుతున్న మానికల సుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులను ఐసీడీఎస్, జిల్లా బాలల సంరక్షణాధికారులు కలిశారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని జాలమ్మ కాలనీకి చెందిన మానికల సుబ్రహ్మణ్యం స్వగృహం వద్ద కుటుంబసభ్యులతో శుక్రవారం అధికారులు మాట్లాడారు. గుంటూరు సమగ్ర బాలల సంరక్షణ కేంద్రం అధికారుల ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా బాలల సంరక్షణాధికారి పి.పురుషోత్తమరావు, ఫోనిక్ జి.కృష్ణ, ఇంకొల్లు సెక్టారు సీడీపీవో టి.ఝాన్సీలు వారి కుటుంబ స్థితిగతులు, పిల్లలు ఎంత మంది, వారి పోషణ ఎలా నిర్వహిస్తున్నారు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. తల్లి మృతి చెందడంతో పసిబిడ్డను పెంచుకోలేక మరో అమ్మకు ఇచ్చానని, డబ్బుకు బిడ్డను అమ్ముకోలేదని అధికారులకు సుబ్రహ్మణ్యం తెలిపాడు. బాపట్లలోని బాలసదన్‌లో పిల్లలందరినీ చదివిస్తామని, మీరు అక్కడు వచ్చి వసతులు, విద్యాబోధన తదితర విషయాలను తెలుసుకొని పిల్లలను అక్కడ చేర్చాలని అధికారులు సుబ్రహ్మణ్యాన్ని కోరారు. తన భార్య లక్ష్మీ పెదకర్మ అనంతరం మా కుటుంబసభ్యులతో మాట్లాడుకొని మీకు తెలియజేస్తానని ఆయన వివరించారు. మూడు రోజులు తరువాత మరల ఇక్కడకు వస్తామని అధికారులు సుబ్రహ్మణ్యానికి తెలిపారు. బాలసదన్‌లో ఆడపిల్లలకు సంరక్షణ, రక్షణ ఉంటుందని తెలిపారు. సుబ్రమ్మణ్యానికి 8 మంది పిల్లలు ఉన్నా ఎవరికీ ఆధార్‌కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు వారికి అందడం లేదు. ఈ విషయం తెలుసుకున్న పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు సుబ్రహ్మణ్యం పిల్లలకు ఆధార్‌కార్డులు అందజేసి, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందజేయాలని అధికారులకు సూచించినట్లు ఏలూరి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో చినగంజాం, సంతరావూరు సెక్టారు సూపర్‌వైజర్లు కే.వాణిశ్రీ, కే.వదనకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.హైమావతి, బి.లక్ష్మి, ఎంఎస్‌కే ఎస్.మీనాక్షి, ఏఎన్ఎం జే.సువార్త తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తకు సెల్‌ఫోను పంపిన లోకేష్

● కృతజ్ఞతలు తెలిపిన దివ్యాంగుడు సురభి నాగేశ్వరరావు


సెల్‌ఫోన్‌ను అందిస్తున్న టీడీపీనేత

బల్లికురవ. సెప్టెంబరు 13 : మండలంలోని కూకట్లపల్లి ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ సోషల్ మీడియా కార్యకర్త సురభి నాగేశ్వరరావుకు శుక్రవారం రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సెల్‌ఫోనును పంపించి స్థానిక నేతల ద్వారా అందించారు. కూకట్లపల్లికి చెందిన సురబి నాగేశ్వరరావు దివ్యాంగుడు. టీడీపీ పార్టీ సానుభూతి పరుడిగా ఉంటు కొంత కాలంగా సోషల్ మీడియా ద్వారా పార్టీ చేపడుతున్న కార్యక్రమాలపై ప్రచారం చేస్తున్నాడు. నాగేశ్వరరావు సెల్‌ఫోను కొన్ని రోజుల నుంచి మరమ్మతులకు గురైంది.. ఈ విషయాన్ని నాగేశ్వరరావు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వచ్చేలా తనకు ఫోను అందించాలని, నేను సోషల్ మీడియాలో పనిచేయలేక పోతున్నానని ఒక పోస్టు ద్వారా విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుడు నాగేశ్వరరావు పెట్టిన పోస్టును చూసిన మంత్రి లోకేష్ వెంటనే తన టీం సభ్యుల ద్వారా నాగేశ్వరరావుకు సుమారు రూ.30 వేల విలువ కలిగిన నూతన సెల్‌ఫోనును పంపించారు. గ్రామ టీడీపీ నేత పందిరి అబ్రహాం చేతుల మీదుగా ఫోనును అందించారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతు తన విజ్ఞప్తిని గమనించి తనకు సెల్ ఫోను అందజేసిన లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

విచ్చలవిడిగా పురుగుమందులు వాడొద్దు


రైతులతో మాట్లాడుతున్న మండల వ్యవసాయ శాఖ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ

అద్దంకి, సెప్టెంబరు13: మనుషుల ఆరోగ్యంపై పురుగు మందుల ప్రభావం ఉంటుందని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మండలంలోని కలవకూరులో శుక్రవారం జరిగిన పొలంబడి కార్యక్రమంలో విచ్చలవిడిగా ఎరువులు, పురుగు మందుల వాడకంపై కలిగే దుష్ప్రభావాలను రైతులకు వివరించారు. పురుగుల మందు పిచికారి చేసేటప్పుడు వాలుకు అనుకూలంగా చేయాలన్నారు. కళ్ళకు అద్దాలు పెట్టుకోవాలని, శిరస్త్రాణం ధరించాలన్నారు. పురుగుమందులను చేతులతో నేరుగా కలపకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు మస్తాన్‌రావు, రైతులు తదితదిరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.1.70 లక్షల విరాళం సేకరణ

పంగులూరు, సెప్టెంబరు 13 : రామకూరు గ్రామస్థులు వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ.1.70 లక్షల చెక్కును రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అందజేశారు. గ్రామటీడీపీ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం గ్రామ ఉప సర్పంచ్ పెదవల్లి అశోక్ నేతృత్వంలో ఈ విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని మంగళగిరిలో శుక్రవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అందచేశారు. కార్యక్రమంలో అశోక్‌తో పాటు పలువురు పార్టీ నేతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇంకొల్లు నుంచి

ఇంకొల్లు : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఇంకొల్లు నల్లమోతు రామానుజమ్మ, వెంకటసుబ్బారావు బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు తమ వంతు సహాయం చేశారు .ఇంకొల్లు, భీమవరం, దగ్గుబాడు గ్రామాలలో ప్రజల నుంచి రూ.30,300లు నగదు సేకరించారు. పాఠశాల ఉపాధ్యాయులు కూడా ఆర్థిక సాయం అందించారు. విద్యార్థినులు వసూలు చేసిన నగదును శుక్రవారం ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు.

వరద బాధితులకు సాయం కోసం విద్యార్థుల ర్యాలీ

మార్టూరు : విజయవాడలోని వరదబాధితులకు సహాయం చేయాలని మండలంలోని వలపర్ల గ్రామ జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్ ఆఫీసర్ కె. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ప్రజలనుంచి రూ. 13,097ల వసూలయ్యాయని ఆయన తెలిపారు.

గడియారస్తంభం నిర్మాణం లేనట్లే


చీరాలలోని గడియారస్తంభం (ఫైల్)

చీరాల, సెప్టెంబరు 13 : చీరాల పట్టణంలోని ల్యాండ్ మార్కులలో గడియార స్తంభం సెంటర్ ఒకటి. ప్రస్తుతం అక్కడ గడియార స్తంభం మాత్రం లేదు. ఆ పేరు మాత్రం అలానే ఉంది. మున్సిపాలిటీ పరంగా ఇకపై గడియారస్తంభం నిర్మాణం చేపట్టే ఆలోచన కూడా లేనట్లు తెలుస్తోంది. చీరాల ప్రధాన కూడలిలోని గడియార స్తంభంకు సుదీర్ఘ చరిత్ర ఉంది. 1950 ప్రాంతంలో అప్పటి మున్సిపల్ చైర్మన్ అన్నదాత నాగేంద్రుడు హయాంలో గడియార స్తంభాన్ని నిర్మించారు. అప్పట్లో ఇది పురప్రజలకు సమయ దిక్సూచిగా ఉండేది. అయితే తరువాత జరిగిన పరిణామాల క్రమంలో తొలుత నిర్మించిన గడియారస్తంభాన్ని పురపాలకులు తొలగించారు. సుమారు దశాబ్దంన్నర క్రితం గడియారస్తంభం కూడలిలోని మున్సిపల్ భవన సముదాయాన్ని తొలగించే క్రమంలో స్తంభాన్ని కూడా తొలగించారు. ఆ తరువాత రూ.14 లక్షల వ్యయంతో మరో గడియారస్తంభాన్ని నిర్మించారు. అయితే అందులో గడియారాలు ఏ రోజూ సరైన సమయం సూచించేవికావు. దీంతో ఆ గడియార స్తంభాన్ని కూడా తొలగించారు. దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేస్తామని పాలకులు, అధికారులు చెప్పుకుంటూ వస్తున్నారు. అయితే అది ఆచరణకు నోచుకోలేదు. ఓ దశలో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి నిర్మించేందుకు టెండర్లు పిలిచారు. అయితే కాంట్రాక్టరు నిర్మాణం చేపట్టేందుకు ముందుకు రాలేదు. ఆతరువాత ఐటీసీ, ఐఎల్‌టీడీ కంపెనీ వారు నిర్మాణం చేపట్టేందుకు సుముఖత చూపారు. తరువాత వారూ ఆ ఆలోచనను విరమించుకున్నారు. మొత్తం మీద గడియారస్తంభం సెంటర్ పేరుకు మాత్రమేగాని అక్కడ ఏర్పాటు జరిగే అవకాశం లేదని పురప్రజలు భావిస్తున్నారు.

పరిశీలించి తగిన చర్యలు చేపడతాం

- చక్రవర్తి, కమిషనర్, చీరాల మున్సిపాలిటీ

గడియారస్తంభం అనేది ఒక ల్యాండ్ మార్క్. గతంలో ఏం జరిగిందనేది పూర్తిగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. అందుకు సంబంధించి విషయాన్ని ఎమ్మెల్యే కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి తదనుగుణంగా చర్యలు చేపడతాం.

అమ్మ చివరి ఫొటో..

● రెండు రోజుల వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు
● ముగిసిన అంత్యక్రియలు
● చివరిసారిగా అమ్మ ఫొటో తీసుకున్న పెద్ద కుమార్తె
● కన్నీటి పర్యంతమైన బంధువులు


చివరిసారిగా తల్లి ఫొటో తీసుకుంటున్న పెద్ద కుమార్తె

చీరాల మండలంలో జరిగిన హృదయవిదారక ఘటన ఆ పసి గుండెలకు తీరని గాయాన్ని మిగిల్చింది. రెండు రోజుల వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోయిన వారి వేదన చెప్పనలవికానిది. శుక్రవారం కావూరివారిపాలెం పంచాయతీ ఆంధ్రకేసరి నగర్‌కి చెందిన దుడ్డు కుమారి(35)కు బంధువులు అంత్యక్రియలు ముగించారు. ఆమె భర్త సతీష్ గత సోమవారం తెల్లవారుజామున మృతిచెందగా అంతిమ సంస్కారాలు ముగిశాయి. అలాగే గురువారం మృతిచెందిన అతని భార్య కుమారికి శుక్రవారం అంత్యక్రియలు చేశారు. అయితే తల్లికి కార్యక్రమాలు ముగించే క్రమంలో పెద్దకుమార్తె సాత్విక ఫోన్‌లో తల్లి చివరి ఫొటో తీసుకుంది. అంతేకాకుండా మృతురాలు క్రిస్టియన్ కావడంతో ముగింపు ప్రార్థన జరుగుతుండగా పెద్ద కుమార్తె, చిన్న కుమార్తె శ్రేష్ఠ చివరి పాటను వారే పాడి కార్యక్రమాలను ముగించారు. వారి అమాయకపు ప్రవర్తనను చూస్తున్న బంధువులు దేవుడా ఇటువంటి వేదన ఎవరికీ రాకూడదని రోదించారు. ఎంతో ఆనందంగా గడుస్తున్న ఆ చిన్నారుల జీవితాలు తల్లిదండ్రుల మృతితో తీరని శోకాన్ని మిగిల్చాయి.

- చీరాలటౌన్

ఉత్సవాల నిర్వహణ హర్షణీయం

- ఎమ్మెల్యే కొండయ్య


గణపతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే కొండయ్యను సన్మానిస్తున్న ఎంజీసీ మార్కెట్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

చీరాల, సెప్టెంబరు 13 : గణపతి నవరాత్రి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించటం హర్షణీయమని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య అన్నారు. స్థానిక ఎంజీసీ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన శేషవయన గణపతి మందిరంలో శుక్రవారం ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. 30 అడుగుల ఎత్తున్న వినాయకప్రతిమ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ ప్రతినిధులు, వ్యాపారులు ఆనవాయితీగా గణపతి ఉత్సవాలను నిర్వహిస్తున్న విధానాన్ని వివరించారు. క్రమం తప్పకుండా కొనాగిస్తున్న ఉత్సవాలలో ఇది 34వ సంవత్సరమని తెలిపారు. పూజ కార్యక్రమాల అనంతరం నిర్వహకులు ఎమ్మెల్యే కొండయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహాత్మాగాంధీ డెవలప్‌మెంట్ సొసైటీ, ది టెక్స్‌టైల్ మర్చంట్స్ అసోసియేషన్, ఎంజీసీ మార్కెట్ కమిటీ ప్రతినిధులు, వస్త్రవ్యాపారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పూర్తి సహకారం


విద్యార్థులకు నగదు ప్రోత్సాహాన్ని అందజేస్తున్న కూకట్ల పౌండేషన్ నిర్వాహకులు కూకట్ల సుబ్బారావు, వింధ్యావళి దంపతులు

అద్దంకి, సెప్టెంబరు13: విద్యాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని కూకట్ల ఫౌండేషన్ నిర్వాహకులు కూకట్ల సుబ్బారావు అన్నారు. మండలంలోని తిమ్మాయపాలెం హైస్కూల్ ప్లస్ విద్యార్థినులు ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని నర్సింగ్ కోర్సులో చేరుతున్న అన్నంగి స్రవంతి, బుసి రమ్యలకు కూకట్ల పౌండేషన్ తరపున ఒక్కొక్కరికి 20 వేల రూపాయల నగదు అందజేశారు. మూడు సంవత్సరాల పాటు నగదు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిమ్మాయపాలెం, చక్రాయపాలెం హైస్కూళ్ల హెచ్ఎంలు గంగాధరరావు, కేవీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి మృతి ఉద్యమానికి తీరనిలోటు

పంగులూరు, సెప్టెంబరు 13 : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి ఆపార్టీకి, వామపక్ష ఉద్యమాలకు తీరని లోటని సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు అన్నారు. పంగులూరులో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఏచూరి చిత్రపటానికి రంగారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బైటమంజులూరులో ఏచూరికి పార్టీ నేతలు నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాయిణి వినోద్ బాబు, తలపనేని రామారావు, సుబ్బారావు, గడిపాటి మల్లారెడ్డి, ఆదుంసాహెబ్, కృష్ణకుమారి, రామాంజమ్మ, ఏలియా, సుబ్బరాజు, రామచంద్రరాజు, కృష్ణంరాజు, రమాదేవి, ప్రమీల పాల్గొన్నారు.


ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాగబోయిన రంగారావు తదితరులు

చీరాలలో

చీరాలటౌన్ : ఏచూరికి పలువురు నేతలు ఉపాధ్యాయులు ఘన నివాళులు అర్పించారు. చీరాల మండల పరిధిలోని విజయనగర్ కాలనీ ఎలిమెంటరీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రతినిధులు మాట్లాడారు.

ఘన నివాళి

మార్టూరు : స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఏచూరి సంతాపసభను రైతు సంఘం నాయకులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో కందిమళ్ల రామకోటేశ్వరరావు, బత్తుల హనుమంతరావు,బి.సూరిబాబు, వై.రాంబాబు, గఫూర్, ఇబ్రహీం,గోలి మల్లికార్జునరావు, బి, లక్ష్మీ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.


ఏచూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్నరైతు సంఘం నాయకులు

బాధ్యతగా విధులు నిర్వహించాలి

ఇంకొల్లు, సెప్టెంబరు 13 : అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతగా విధులు నిర్వహించాలని డీసీపీవో పురుషోత్తం అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా ఇంకొల్లులో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల భద్రత, బాలల హక్కులు, బాల్యవివాహాల గురించి కార్యకర్తలకు తగు సూచనలు చేశారు.

నేటి నుంచి త్రివిక్రమ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు

చెరుకూరు(పర్చూరు), సెప్టెంబరు 13: పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలోని త్రివిక్రమ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా నేటి నుంచి 16వ తేదీ వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి నాగయ్య శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఈనెల 16న సోమవారం స్వామివార్లకు శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. తిరుపతి, తిరుమల దేవస్థానం భావన్నారాయణ స్వామివారి బృందంచే స్వామివారికి అభిషేకం నిర్వహి స్తామనిఆయన తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్ల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు పర్చూరులో జాతీయ లోక్ అదాలత్

పర్చూరు, సెప్టెంబరు 13: పర్చూరులోని కోర్టు భవనాల సముదాయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.ప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పు అంతిమతీర్పు అని అన్నారు. రాజీ చేయదగిన అన్నీ కేసులు ఇరు వర్గాల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసులకు సంబంధించి ఫీజులు కూడా తిరిగి చెల్లిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అర్జీదారులు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

అద్దంకి, సెప్టెంబరు13: బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకోవటంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఎస్సై ఖాదర్ బాషా అన్నారు. అద్దంకి పట్టణంలోని శివారు ప్రాంతాలలో శుక్రవారం రాత్రి ఎస్సై తనిఖీలు చేస్తుండగా పలువురు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ పట్టుబడ్డారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు కుర్రవానిపాలెంలో ఉచిత వైద్య శిబిరం

మేదరమెట్ల,సెప్టెంబరు13: కొరిశపాడు మండలంలోని కుర్రవానిపాలెం గ్రామ సచివాలయ ఆవరణలో శనివారం కిమ్స్ హాస్పిటల్ ఒంగోలు వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్యాంప్ కో ఆర్డినేటరు పి, కాలేషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరంలో ఎముకలు, కీళ్లు, నరాలు, కంటిచూపు, గుండె, గ్యాస్ట్రబుల్, సాధారణ వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు.అంతేగాకుండా సుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

విధుల్లోకి మున్సిపల్ కమిషనర్

చీరాల, సెప్టెంబరు 13 : ఎనిమిది రోజుల నుంచి విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో నిర్దేశించిన ప్రదేశాల్లో సహాయక చర్యల్లో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి, సిబ్బంది శుక్రవారం అక్కడ నుంచి రిలీవ్ అయ్యారు. స్థానికంగా తమ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాము నిర్వహించిన విధులను వివరించారు.

నలుగురు జూదరుల అరెస్టు

ఇంకొల్లు, సెప్టెంబరు 13 :మండలంలోని వంకాయలపాడు గ్రామశివారులోని పేకాటస్థావరాలపై ఎస్సై సురేష్ తమ సిబ్బందితో శుక్రవారం దాడులు నిర్వహించారు.పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.19, 900లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

గణనాథుడికి నోట్ల అలంకరణ


నోట్ల అలంకరణలో గణనాథుడు

పంగులూరు, సెప్టెంబరు 13 : మండలంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గ్రామాలలోని మండపాలలో కొలువుదీరిన గణనాథులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. శుక్రవారం భగవాన్‌రాజుపాలెం గ్రామంలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో ఏర్పా టు చేసిన వినాయక విగ్రహాన్ని కరెన్సీనోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రివేళ భజనకార్యక్రమాలు నిర్వహించారు. పంగులూరులోని వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణేషుడికి శుక్రవారం రాత్రి పూజాకార్యక్రమాలు నిర్వహించిన అనంతరం లడ్డూ వేలం నిర్వహించారు.


దేశస్థాయిలో జరిగిన పోస్టర్ కాంపిటేషన్‌లో ఉత్తమ చిత్రంగా ఎంపికయిన విద్యార్థిని భవ్యశ్రీ ప్రదర్శించిన చిత్రం (ఇన్‌సెట్లో) విద్యార్థిని

పోస్టర్ కాంపిటేషన్‌లో కొండమంజులూరు విద్యార్థిని సత్తా

● దేశ స్థాయిలో ప్రథమస్థానం సాధించిన భవ్యశ్రీ

పంగులూరు, సెప్టెంబరు 13 :ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా గత నెలలో భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ దేశ స్థాయిలో నిర్వహించిన పోస్టర్ కాంపిటేషన్‌లో కొండమంజులూరు ఆర్‌జేఆర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పంచుమర్తి భవ్యశ్రీ ప్రథమ స్థానంలో నిలిచింది. మోంట్రియల్ ప్రొటోకాల్ అడ్వాన్సింగ్ క్లైమేట్ యాక్షన్ అనే అంశంపై జాతీయస్థాయిలో ఆగస్టు 30న జరిగిన పోస్టర్ కాంపిటేషన్ పోటీకి దేశ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి 4 వేల మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పాఠశాల హెచ్ఎం అనిత తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన ఫలితాలను న్యూ ఢిల్లీలోని పర్యావరణ శాఖ శుక్రవారం భారతీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రకటించారు. ఈ పోటీలలో బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలం కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని పంచుమర్తి భవ్యశ్రీ ప్రదర్శనకు పంపిన చిత్రం అత్యుత్తమ చిత్రంగా ఎంపికయిందని హెచ్ఎం తెలిపారు. ఈ విద్యార్థినికి తర్ఫీదు ఇచ్చి పాఠశాల పేరు జాతీయ స్థాయిలో ఇనుమడింప చేసిన చిత్రలేఖన ఉపాధ్యాయుడు తిరుమలశెట్టి వెంకటేశ్వరరావుతో పాటు మార్గదర్శకత్వం వహించిన పాఠశాల విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుల సమష్టి కృషిని ఎస్ఎంసీ చైర్మన్ గోలి సంధ్య గ్రామ పెద్ద చింతల సహదేవుడు కొనియాడారు.

ఇసుక అక్రమ రవాణాకు కళ్లెం

● అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్


ఇసుక అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

చీరాలటౌన్, సెప్టెంబరు 13 : ఇసుక అక్రమ రవాణా జరగకుండా పటిష్ట భద్రత నిర్వహిస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు ఏఎస్పీ చీరాల మండల పరిధిలోని విజయలక్ష్మీపురం సమీపంలోని స్ట్రయిట్‌కట్, మోడల్ స్కూల్ సమీపంలో తవ్వకాలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అక్రమ రవాణాకు పోలీస్, రెవెన్యూ, నీటిపారుదల శాఖ, ఎక్సైజ్ విభాగాలు సమన్వయంతో ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. స్టాక్ పాయింట్లలో నిబంధలను అనుసరించి మాత్రమే రవాణా జరిగేలా చూడాలన్నారు. అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా సమాయత్తమవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ జగదీష్ నాయక్, సిఐ సత్యనారాయణ, తహసీల్దార్ గోపీకృష్ణ, నీటిపారుదల శాఖ ఏఈ పురుషోత్తం, ఎక్సైజ్ సీఐ కర్ణ, ఎస్సై శివకుమార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఏఆర్‌టీ రోగులకు ఉచిత అన్నదానం అభినందనీయం

● చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్

చీరాలటౌన్, సెప్టెంబరు 13 : చీరాల ఏరియా హాస్పిటల్‌కు విచ్చేసే ఏఆర్‌టీ రోగులకు ఉచిత అన్నదానం అభినందనీయమని చీరాల డీఎస్పీ జగదీష్‌నాయక్ అన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ జగదీష్ నాయక్

చైతన్య మనోవికాస కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఏరియా హాస్పిటల్‌లో ఏఆర్‌టీ రోగులకు ఏర్పాటు చేసిన నిత్య అన్నదానం కార్యక్రమానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రోగులకు మందులతో పాటు ఆహారం చాలా ముఖ్యమని చెప్పారు. నిర్వాహకులు డైరక్టర్ వెంకన్నబాబు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి, ఏఆర్‌టీ నోడల్ అధికారి డాక్టర్ హరిబాబు, ఆర్ఎంవో శ్రీకాంత్, ప్రతినిధులు జానీబాషా, సిబ్బంది, ఐసీటీసీ సిబ్బంది, డీఆర్‌సీ కౌన్సిలర్‌లు, ఏఆర్‌టీ రోగులు పాల్గొన్నారు.

వ్యాసరచనలో ద్వితీయ స్థానం


ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న విద్యార్థిని ఆరుద్ర తన్మయి

అద్దంకి, సెప్టెంబరు13: వికసిత్ ఆంధ్రప్రదేశ్ ఎట్ - 2047 అనే అంశంపై జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో అద్దంకి మండలం తిమ్మాయపాలెం హైస్కూల్ 10 వ తరగతి విద్యార్థిని ఆరుద్ర తన్మయి ద్వితీయ స్థానం పొందింది. ఈ సందర్భంగా విద్యార్థిని తన్మయిని, గైడ్‌గా వ్యవహరించిన మ్యాథ్స్ ఉపాధ్యాయురాలు ద్వారకాదేవి, సైన్స్ ఉపాధ్యాయురాలు ధనలక్ష్మిలను హెచ్ఎం గంగాధరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


పౌష్టికాహార మాసోత్సవాల్లో గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 13 : గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏసీడీపీవో ఎం. సుచిత్ర చెప్పారు. మండల పరిధిలోని దేశాయిపేట సెక్టార్ నీలకంఠపురం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లీలావతి, అంగన్వాడీ కార్యకర్త అంజలి, గర్భవతులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.